# మనం
కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు
శుక్రవారం | 18 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 13


## దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

5 లో





### కొండ ప్రాంతాల ప్రజల సంక్షేమానికి
# కొండంత భరోసా!

6 లో

పి.మీరాహుస్సేన్ ఖాన్

- పునరావాసం, భద్రత, జీవన ప్రమాణాలు, గృహ వసతులపై ప్రత్యేక దృష్టి
- సవాళ్లను అధిగమించి సుస్థిర సమాజ నిర్మాణం వైపు ముందడుగు
- మేధోమథనానికి వేదికగా ఎస్పీఏలో ప్రత్యేక సమావేశం

-విజయవాడ, మనంబ్యూరో




8 లో


### ఉద్యోగుల మానసిక ఆరోగ్యానికి
## ప్రత్యేక కార్యక్రమం

- ప్రతి గురువారం ఉచిత మానసిక ఆరోగ్య సెషన్స్
- జిల్లా కలెక్టర్ చొరవతో ఆకర్ష ఫౌండేషన్...
- భాగస్వామ్యంతో కార్యక్రమం

## పారిశ్రామికవేత్తల సంక్షేమం... వ్యాపారాల విస్తరణే లక్ష్యం

6 లో

- పారిశ్రామిక, వ్యాపార రంగ అభివృద్ధికి ప్రత్యేక వేదికగా ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్
- 180 మంది పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికుల నుంచి సమస్యలు, దరఖాస్తుల స్వీకరణ
- ఉదయం నుంచి సాయంత్రం వరకు సమస్యలను ఓపికగా విన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



# రెండు కీలక బీఐఎస్ ధృవీకరణలు సాధించిన ఏఎంఎన్ఎస్ ఇండియా



గాంధీనగర్ సెప్టెంబర్ 17 మనం న్యూస్: ప్రత్యేక ఉక్కు రంగంలో తన మార్కెట్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ అర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా) రెండు కీలక భారతీయ ప్రమాణాల సంస్థ ధృవీకరణలను సాధించింది. తాజాగా ప్రవేశపెట్టిన ఐఎస్ 2062 (పార్ట్ 2):2026 ప్రమాణం కింద వేడి చుట్టిన క్వెంచ్డ్ అండ్ టెంపర్డ్ ఉక్కు ప్లేట్లు, షీట్లు, స్ట్రిప్స్, వైడ్ ఫ్లాట్స్ కోసం దేశంలోనే తొలి బీఐఎస్ లైసెన్స్ పొందిన ఉక్కు తయారీ సంస్థగా ఏఎంఎన్ఎస్ ఇండియా నిలిచింది. అలాగే ముందుగా రంగు పూసిన జింక్-అల్యూమినియం -మెగ్నీషియం మిశ్రమ పూత కలిగిన ఉక్కు స్ట్రిప్, షీట్ కోసం ఐఎస్ 19210:2025 ప్రమాణాల కింద బీఐఎస్ లైసెన్సును పొందింది. ఈ ధృవీకరణలు ప్రభుత్వ నిధులతో చేపట్టే మౌలిక సదుపాయాలు, రక్షణ, ప్రభుత్వ రంగ ప్రాజెక్టులకు దేశీయంగా ధృవీకరించబడిన ఉక్కు సరఫరాకు మార్గం సుగమం చేయనున్నాయి. క్వెంచ్డ్ అండ్ టెంపర్డ్ ఉక్కు అధిక బలం, మన్నికను కలిగి ఉండటంతో వంతెనలు, భారీ ఇంజినీరింగ్ పరికరాలు, గనుల యంత్రాలు, సముద్ర నిర్మాణాల్లో వినియోగించవచ్చు. జింక్- అల్యూమినియం -మెగ్నీషియం పూత కలిగిన ఉక్కు అధిక తుప్పు నిరోధకత, దీర్ఘకాలిక సేవా జీవితాన్ని అందిస్తుంది. హజీరా, పూణే కేంద్రాల్లో తయారయ్యే ఈ ఉత్పత్తులు దేశీయ అవసరాలను తీర్చడంతో పాటు దిగుమతి ప్రత్యామ్నాయానికి తోడ్పడనున్నాయి.

# విద్యార్థులు ఉన్నత విద్యతో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలి



▶▶ యువ నేత శ్రీరాం ధనుంజయ (చిన్నబాబు)

▶▶ వాగ్దేవి మహిళ కళాశాలలో వినాయక చవితి ముగింపు వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన యువ నేత శ్రీరామ్ చినబాబు

జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్: విద్యార్థులు మంచి విద్య అభ్యసించి ఉన్నత మైన ఉద్యోగ ఉపాధి అవకాశాలను పొందాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు యువ నేత శ్రీ రామ్ చిన్నబాబు అన్నారు. పట్టణంలోని వాగ్దేవి మహిళా కళాశాలలో గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు గురువారం నిమజ్జన కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. సుమారు 1000 మంది మహిళా విద్యార్థుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకలు సందడిగా సాగాయి. నిమజ్జన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం ధనుంజయ (చిన్నబాబు) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో విజేతలుగా నిలిచిన ఫైనల్ బీకాం విద్యార్థులకు లడ్డూను బహుకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి చిన్నబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. మంచి విద్యతో భవిష్యత్తులో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందుతూ తల్లిదండ్రులకు, కళాశాలకు, జగ్గయ్యపేట పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన అన్ని విధాలా ప్రోత్సాహం అందించాలని కళాశాల యాజమాన్యాన్ని కోరారు.వాగ్దేవి మహిళా కళాశాలలో విద్యార్థుల భాగస్వామ్యంతో మూడు రోజుల పాటు వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుస్సా సురేష్, కరస్పాండెంట్ బుస్సా సరిత, డైరెక్టర్ జ్వలిత సాయి, అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ'/జడ్పిటిసి. ఎలక్షన్స్ కు సంబంధించి పోలింగ్ స్టేషన్లు, డ్రాఫ్ట్ జాబితా పై అఖిలపక్ష సభ్యులతో సమీక్ష



పెనుగంచిప్రోలుసెప్టెంబర్ 18 మనం న్యూస్: పెనుగంచిప్రోలు లోని మండలపరిషత్ కార్యాలయం లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జీ. శ్రీను అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఉత్తర్వుల ప్రకారం ఎంపీటీసీ'/జడ్పిటిసి. ఎలక్షన్స్ కు సంబంధించి పోలింగ్ స్టేషన్లు డ్రాఫ్ట్ జాబితాను పరిశీలించి అభిప్రాయాలు/అభ్యంతరాలు తెలుపుటకు వివిధ గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడమైనది, ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ తరుపున జీల్లేపల్లి సుదీర్ , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున పొన్నం కోటేశ్వరరావు . గుడిమెట్ల శంకర్ జనసేన తరుపున వై.నరసింహారావు బీజేపీ తరుపున కాల్లురి శ్రీవాణి , కాంగ్రెస్ తరుపున ఎన్. ధనుంజయ ,సిపిఐ తరుపున. దారా నాగేశ్వరరావు .సీపీఎం తరుపున కే. బాబు రావు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు

కంచికచర్ల, సెప్టెంబర్ 17(మనం న్యూస్); విశ్వకర్మ జయంతి సందర్భంగా కంచికచర్ల మండల భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కాలవ మహేష్ బాబు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కాలవ మహేష్ బాబు మాట్లాడుతూ హిందూ పురాణాల ప్రకారం ఋగ్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో సృష్టి కర్తగా విశ్వకర్మను పరిగణిస్తారు. అధర్వణ వేదంలో ఆహార ప్రదాతగా పేర్కొంటారు. పురుష సూక్తంలో విరాట పురుషుడిగా కీర్తి గడించాడు. సహస్ర బాహుగా, సహస్ర చక్షుగా, సహస్ర పాదుడుగా, సహస్ర ముఖుడిగా అన్ని వేదాల్లోనూ ప్రస్తావించిన వ్యక్తి విశ్వకర్మ. విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించామని ఈ సందర్భంగా విశ్వకర్మ జయంతి ప్రాముఖ్యతను అన్ని రకాల నిర్మాణ కార్మికులకు వివరించారు.నిర్మాణ రంగంతో పాటు వివిధ వృత్తులకు విశ్వకర్మను ఆదిగురువుగా భావిస్తామని భారతదేశ మేడే ని విశ్వకర్మ జయంతి రోజున జరుపుకోవాలని మండల బీజేపీ అధ్యక్షులు కాలవ మహేష్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కాలవ మహేష్ బాబు,మండల ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి నాగరాజు, జిల్లా ఎస్సీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ వడపల్లి విజయబాబు, జిల్లా మహిళా మోర్చా వైస్ ప్రెసిడెంట్ దేవరకొండ రమాదేవి, భారతీయ జనతా పార్టీ నాయకులు గుదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# జగ్గయ్యపేట దుర్గాపురంలో గడపగడపకు ప్రజా పోరుబాట



▶▶ ఇంటింటికీ వెళ్లిన సమస్యలను అడిగి తెలుసుకున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్: ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయటమే ప్రజా పోరుబాట లక్ష్యమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు.పట్టణం, 11 వ వార్డు, దుర్గాపురంలో గురువారం ఉదయం నిర్వహించిన గడపగడపకు ప్రజా పోరుబాట కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను అందజేశారు. గతంలో అందిన సంక్షేమం, జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తు చేశారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడమే లక్ష్యంగా గడపగడపకు ప్రజా పోరుబాట కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, పట్టణ యువజన విభాగ అధ్యక్షులు రామిని ఉపేందర్ రెడ్డి, పట్టణ వాణిజ్య విభాగ అధ్యక్షులు సంపంగి గోపాలకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటమి భయం పట్టుకుంది




▶▶ వైఎస్ఆర్సీపీ మండల పార్టీ అధ్యక్షులు బండి మల్లికార్జున రావు

▶▶ పోలీసుల అత్యుత్సాహం పై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆగ్రహం

కంచికచర్ల సెప్టెంబర్ 17(మనం న్యూస్): మొగులూరు గ్రామంలో ఇటీవల జరిగిన ఘటన పై అధికారులు తెలుగుదేశం పార్టీ నేతల ఆదేశాలతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్ఆర్సీపీ పట్టణ అధ్యక్షులు వేమా సురేష్ బాబు. బాధ్యత గల వ్యక్తులపై కేసు నమోదు చేయాలంటే ముందుగా విచారణ జరపాలి కాని.అక్రమంగా కేసు పెట్టి పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన బండి మల్లికార్జునరావు . ఇటీవల అధికార పార్టీ ఎమ్మెల్యే రోడ్డు అభివృద్ధి పనుల నిమిత్తం మొగులూరు గ్రామానికి వచ్చారని, ఆ సమయంలో టిడిపి కార్యకర్తలు పూటుగా మద్యం తాగి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుడు ఇంటి ముందుకు వెళ్లి సైలెన్సర్లు లేని బైకులతో.హల్చల్ చేయడమే కాకుండా.ఇంట్లో ఉన్న మహిళలను అసభ్యకరంగా తిట్టారని, మహిళలు తీవ్ర భయాందోళనలకు గురై ఘర్షణకు దిగారని తెలిపారు. ఆ గొడవ కు కారణం తానే అని పోలీసులు తనపై కేసు పెట్టారు.. తాను ఆరోజు నందిగామ కోర్టులో ఉన్నానని. కనీసం విచారణ కూడా చేయకుండా టిడిపి నేతలు చెప్పారని.. అక్రమంగా పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపిన బండి మల్లికార్జునరావు .తనతో పాటు, తమ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసు నమోదు చేసి.4 రోజుల పాటు పోలీస్ స్టేషన్ కు తిప్పుతూ.గంటల తరబడి కూర్చోబెట్టి. వేధింపులకు గురి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు . గ్రామాలను కనీసం అభివృద్ధి చేయకుండా.అన్ని గ్రామాలను బెల్టు షాపులతో అభివృద్ధి చేశారని. మౌలిక సదుపాయాల కల్పనను మరచిపోయి టిడిపి నేతలు బెల్ట్ షాపులే అభివృద్ధిగా భావిస్తున్నారని మండిపడ్డారు.వెన్నుపోటు పార్టీ పాలను ప్రజలంతా గమనిస్తున్నారని.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని... వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు పాల్గొన్నారు.

# మోదీ జన్మదినం సందర్భంగా 'ఆశీర్వాద్ కా దియా'

**▸▸ దేశ ప్రగతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి దీపాలు వెలిగించి ఆశీస్సులు**

**▸▸ మద్దతు తెలియజేయాలి: ఎమ్మెల్యే వసంత**



మైలవరం సెప్టెంబర్ 17 మనం న్యూస్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించు కుని స్థానిక నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎన్టీఆర్ జిల్లా వసంత వెంకట కృష్ణప్రసాదు ఈ కార్యక్రమంలో పాల్గొని దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ దేశ ప్రగతి, అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిరం తరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి ప్రధాని మోదీ కి ఆశీస్సులు, మద్ద తు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా సేవకు గుర్తుగా నిర్వహించిన 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇళ్ల వద్ద దీపాలు వెలిగిస్తూ ప్రధానమంత్రి మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశం మరింత అభివృద్ధి పథంలో ముందు కు సాగాలని, ప్రజల సంక్షే మం, దేశ ప్రగతి నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఈ దీపోత్సవాన్ని నిర్వ హించినట్లు తెలిపారు.

# దేవాదాయ శాఖ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తిరుపతమ్మ దేవస్థానం చైర్మన్ చుంచు రమేష్



పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 17: మనం న్యూస్: శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థాన పాలక మండలి చైర్మన్ చుంచు రమేష్ బాబు గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ కే. రాంచంద్ర మోహన్ ని ప్రధాన కార్యాలయం గొల్లపూడి నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవస్థాన అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై కమిషనర్ గారితో చర్చించారు. దేవస్థాన అభివృద్ధికి అవసరమైన చర్యలు, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు సంబంధించిన అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా దేవస్థాన అభివృద్ధికి సంబంధించి పలు విషయాలపై చర్చించారు.

# ఇనాం భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

**▸▸ ఈనామ్ బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా**

**▸▸ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)**



జగ్గయ్యపేట: సెప్టెంబర్ 17 మనం న్యూస్: జగ్గయ్యపేట పట్టణంలో ఇనాం భూముల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అండగా జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ నిలిచింది. గత పది రోజులుగా ఇనాం భూ బాధితుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కౌన్సిల్ సభ్యులతో కలిసి గురువారం సందర్శించి, బాధితులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగపురం రాఘవేంద్ర , వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ , హఫీజ్ ఉన్నీసా తదితర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఇనాం భూముల సమస్యపై బాధితులు తమ ఇబ్బందులను ఎమ్మెల్యే రాజగోపాల్ దృష్టికి తీసుకురాగా, ఆయన వారి సమస్యలను పూర్తిగా విని, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మరియు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన మార్గంలో శాశ్వత పరిష్కారం లభించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### ఇనాం భూములు ఎండోమెంట్ భూములు కావు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ, జగ్గయ్యపేట పట్టణంలో ఇనాం భూముల సమస్య ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతోందని, దీనివల్ల వేలది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.ఇనాం భూములు అనగానే వాటిని ఎండోమెంట్ భూములుగా భావించడం సరికాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ అంశంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో మాట్లాడటంతో పాటు, ఎండోమెంట్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో కూడా చర్చించినట్లు తెలిపారు.గతంలో దేవస్థానాల్లో సేవలు అందించిన వారికి ఇనాం భూములు కేటాయించబడ్డాయని, అనంతరం సంబంధిత వ్యక్తులు రెవెన్యూ శాఖకు చెల్లింపులు చేసి ఆ భూములను తమ ఆధీనంలోకి తీసుకున్న సందర్భాలు ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. జగ్గయ్యపేట పట్టణంలో అనేక సంవత్సరాలుగా ప్రజలు కొనుగోలు చేసి అనుభవిస్తున్న ఈ భూముల విషయంలో వాస్తవ పరిస్థితులను పూర్తిగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. బాధితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి భూమి హక్కులు, పట్టాలు, రికార్డులకు సంబంధించిన సమస్యలపై చట్టపరమైన పరిష్కారం లభించేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

### 3,000 కుటుంబాలకు చెందిన 650 ఎకరాలపై ప్రభావం చైర్మన్ రాఘవేంద్ర

మున్సిపల్ చైర్మన్ శ్రీ రంగపురం రాఘవేంద్ర మాట్లాడుతూ, జగ్గయ్యపేట పట్టణంలో ఇనాం భూముల సమస్య కారణంగా సుమారు 3,000 కుటుంబాలకు చెందిన 650 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి వీలు లేకుండా పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా 50 నుంచి 60 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన భూములు సైతం నేడు ఇనాం భూముల సమస్యలో చిక్కుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సమస్య కేవలం భూ బాధితుల సమస్య మాత్రమే కాదని, దీని ప్రభావం ప్రభుత్వ ఆదాయంపైనా పడుతోందని రాఘవేంద్ర తెలిపారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన రిజిస్ట్రేషన్ ఆదాయం కూడా నిలిచిపోతోందని, తద్వారా ప్రజలతో పాటు ప్రభుత్వానికి కూడా ఆర్థిక నష్టం కలుగుతోందన్నారు. అంతేకాకుండా జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధి వేగాన్ని కూడా ఇనాం భూముల సమస్య ప్రభావితం చేస్తోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తే భూ యజమానులకు న్యాయం జరగడంతో పాటు పట్టణ అభివృద్ధికి కూడా మరింత ఊతం లభిస్తుందని తెలిపారు.

### బాధితులకు అండగా మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం

జగ్గయ్యపేట మున్సిపాలిటీలో జరిగిన సాధారణ సమావేశంలో ఇనాం భూముల సమస్యపై కౌన్సిల్ సభ్యులు విస్తృతంగా చర్చించారు. బాధితులు గత పది రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షను, వారి సమస్యల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కౌన్సిల్ సభ్యులందరూ పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ తీర్మానాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , సంబంధిత మంత్రులు మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మున్సిపల్ చైర్మన్ తెలిపారు. అవసరమైన చర్యలు తీసుకునేలా ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ సెక్రటరీ మరియు సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు కూడా కౌన్సిల్ తరపున నివేదనలు పంపనున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తున్నప్పటికీ, ఎప్పటిలోగా సమస్య పరిష్కారమవుతుందనే దానిపై స్పష్టమైన కాలపరిమితి ప్రకటించాలని బాధితులు ఎమ్మెల్యే ని కోరారు. దీనిపై ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్పందిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో మరోసారి మాట్లాడి, సమస్య పరిష్కారానికి సంబంధించి స్పష్టమైన హామీ తీసుకురావడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ప్రజలకు న్యాయం చేయడం, వారి భూమి హక్కులను కాపాడడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఇనాం భూముల సమస్య ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న నేపథ్యంలో బాధిత కుటుంబాల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన మార్గంలో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. ఎమ్మెల్యేహామీతో బాధితులు సానుకూలంగా స్పందించి ఆనందం వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు సంబంధించిన ఈ కీలక సమస్యపై పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా మున్సిపల్ కౌన్సిల్ మొత్తం ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవ తీర్మానం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ప్రజల భూ హక్కుల పరిరక్షణ కోసం బాధితులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు కౌన్సిల్ సభ్యులందరూ సంఘీభావం ప్రకటిస్తూ, సమస్య పరిష్కారం అయ్యే వరకు బాధితులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.


# కర్ణాటకలో సామ్సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్-2026 ప్రారంభం



గాంధీనగర్ సెప్టెంబర్ 17 మనం న్యూస్: కర్ణాటకలో కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో యువతకు నైపుణ్యాలను అందించేందుకు సామ్సంగ్ ఇండియా సామ్సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ (ఎస్ఐసీ)-2026 కార్యక్రమాన్ని ప్రారంభించింది. కర్ణాటక ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ్ రాయరెడ్డి సమక్షంలో ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక ఛాంబర్స్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్తో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన నృపతుంగ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా కర్ణాటకలో 2,000 మంది యువతకు పరిశ్రమకు అనుగుణమైన ఏఐ విద్య, ప్రాక్టికల్ శిక్షణ, నిపుణుల మార్గదర్శకత్వం అందించనున్నారు. 18-25 ఏళ్ల యువతకు హ్యాండ్స్ఆన్ ఏఐ, జనరేటివ్ ఏఐ శిక్షణతో పాటు వాస్తవ సవాళ్లకు పరిష్కారాలను రూపొందించే అవకాశాలు కల్పించనున్నారు. కర్ణాటకలో ఈ కార్యక్రమ ద్వారా ఇప్పటికే 3,000 మందికి పైగా శిక్షణ పొందారు. దేశవ్యాప్తంగా 2025లో సామ్సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ద్వారా 20,000 మందికి పైగా శిక్షణ పొందగా, వారిలో మహిళల వాటా 48 శాతంగా ఉంది. 2026లో 10 రాష్ట్రాల్లో 20,000 మంది యువతకు శిక్షణ అందించాలన్న సామ్సంగ్ లక్ష్యంలో కర్ణాటక కార్యక్రమం భాగం. ఎలక్ట్రానిక్స్ సెక్టర్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఈఎస్ఎస్సీఐ), టెలికామ్ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ (టీఎస్ఎస్సీ) సహకారంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు.

# మొగులూరు అంగన్వాడి కేంద్రంలో తొమ్మిదవ జాతీయ పోషణ్ మా కార్యక్రమం

కంచికచర్ల సెప్టెంబర్ 17(మనం న్యూస్): అంగన్వాడీ కేంద్రాలలో వేడిగా తాజాగా శుభ్రమైన పోషకాలతో కూడిన భోజనం అందిస్తున్నట్లు సిడిపిఓ లక్ష్మీ భార్గవి పేర్కొన్నారు తొమ్మిదవ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మొగులూరు అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఆహారంలో ప్రతిరోజు వైవిధ్యం ఉండాలని చిరుధాన్యాలు పప్పులు, ఆకుకూరలు సీజనల్ కూరగాయలు మునగాకు ఉండేలా చూడాలని అన్నారు ప్రతి నెల ఐబీఆర్ఎస్ కాల్స్ వస్తాయని లబ్ధిదారులు కాల్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఒకటవ బటన్ నొక్కాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ షేక్ కరిమ అంగన్వాడీ కార్యకర్తలు నారాయణమ్మ, వేణు, సలీమా, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రధానమంత్రి మోదీ జన్మదిన వేడుకలు

**వీరులపాడు సెప్టెంబర్ 17, మనం న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈరోజు జుజ్జూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కూటమి నాయకులు కొవ్వొత్తులు వెలిగించి,ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మోదీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే లైన్ కోసం భూములు తీసుకువటం రైతులకు సరైన ధర కల్పించాలి



**సిపిఎం డిమాండ్**

**వీరులపాడు, సెప్టెంబర్ 17, మనం న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు మండల కేంద్రంలో అల్లూరు గూడెం మాదారం రైల్వే లైన్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డిఓ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు ప్రభుత్వ నిబంధన మేరకు రైతులకు న్యాయం చేస్తామని ఆర్డిఓ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధికి సిపిఎం పార్టీ అడ్డంకి కాదని భూములు కోల్పోతున్న రైతులకు సరైన ధర కల్పించాలని కోరారు. భూములు కోల్పోతే రైతులతోపాటు ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్నా రైతులకి సాగుదారుల గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని భూమి పై ఆధారపడి జీవనం సాగిస్తున్న వ్యవసాయ కూలీలకు అనుబంధ రంగాల పనిచేస్తున్న కార్మికులకి ఆదుకోవాలని కోరారు బలవంతంగా భూములు తీసుకోవాలని ప్రయత్నిస్తే రైతులు తరఫున పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు, ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

**పామర్రు మంటాడ సెప్టెంబర్ 17 (మనం న్యూస్ ):** ఆరోగ్యకరమైన తల్లే.. దేశానికి శ్రీరామరక్ష అని వైద్యులు డాక్టర్ బాలాజీ స్పష్టం చేశారు. కపిలేశ్వరపురం సెక్టార్ పరిధిలోని మంటాడ5వ అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్వైజర్ టి అనిత నేతృత్వంలో నిర్వహించిన 'పోషణ్ అభియాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ జాతీయ పోషకాహార మహోత్సవంలో ఆయన గర్భిణీలు, బాలింతలకు దిశానిర్దేశం చేశారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు లభించే స్థానిక ఆహార పదార్థాల ప్రాధాన్యతను ఆయన మహిళలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. పోషకాహార లోపం



వల్ల కలిగే నష్టాలను, విటమిన్ల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలోఅంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# కటూరి హరిబాబును పరామర్శించిన సామినేని

**జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్:** విజయవాడ బెస్ట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జగ్గయ్యపేట కమ్యూనిటీ హాస్పిటల్ మాజీ చైర్మన్ కఠారి హరిబాబు ని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పరామర్శించారు. ప్రమాదవశాత్తు గాయపడిన హరిబాబు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు . వైద్యశాలకు వెళ్ళిన సామినేని ఉదయభాను, హరిబాబును పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హరిబాబు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



# జగ్గయ్యపేటకు పాసింజర్ రైలు మంజూరు చేయాలని కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి. సోమన్న ని కలిసిన శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్:** జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు సర్వీసును మంజూరు చేయాలని కోరుతూ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ కేంద్ర రైల్వే, జల్ శక్తి శాఖ సహాయ మంత్రి వి. సోమన్న కి వినతిపత్రం అందజేశారు.జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరా రాజగోపాల్ తాతయ్య మరియు యువనేత శ్రీరా కృష్ణ నిహార్ ఢిల్లీలో మంత్రి సోమన్న నివాసంలో వారిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ తో కలిసి కేంద్రమంత్రి అల్పాహార విందు చేశారు. అల్పాహార విందు సందర్భంగా జగ్గయ్యపేటకు రైలు సర్వీసు మంజూరు చేయాల్సిన అవసరాన్ని ప్రతినిధి బృందం మరోసారి మంత్రి వర్యులకు వివరించింది. జగ్గయ్యపేట ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అయిన ఈ రైలు సర్వీసు ఏర్పాటు వల్ల స్థానికులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని బృందం తెలిపింది. ఇదే విషయమై విజయవాడ ఎంపీకేశినేని శివనాథ్ (చిన్ని) గతంలో కేంద్ర మంత్రి ని కలిసి, జగ్గయ్యపేటకు రైలు సర్వీసు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై సెంట్రల్ మినిస్టర్ వెంటనే ఒక టీం కూడా ఏర్పాటుచేసి దీనిమీద క్షుణ్ణంగా పరిశీలన చేయవలసిందిగా కోరారు. కేంద్ర మంత్రి సోమన్న విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# డిసెంబర్‌లో జరిగే బిజినెస్ సదస్సుకు ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రులను కలిసిన ఆహ్వానించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, శ్రీరాం కృష్ణ నీహార్ , ప్రతినిధి బృందం



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్:** డిసెంబర్ 25, 26, 27 తేదీల్లో బెంగళూరులో జరగనున్న ప్రతిష్టాత్మక బిజినెస్ సదస్సు గ్లోబల్ ఎక్లే రె టర్ విజన్ సమి ట్ 2026కు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరుతూ, భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ను, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు , కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి , కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తదితర ప్రముఖులను న్యూఢిల్లీలో కలిసి ఆహ్వానించడం జరిగింది. ఢిల్లీలో జరిగిన ఈ ఆహ్వాన కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య , మహారాష్ట్ర బల్లార్పూర్ ఎమ్మెల్యే సుధీర్ ముంగంటివార్ , కర్ణాటక ఎమ్మెల్యే అరుణ్ , శ్రీరాం కృష్ణ నిహార్



కర్ణాటక ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు రవిశంకర్, కోర్ కమిటీ సభ్యులుహరీష్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా యువతలో వ్యాపారోద్యమ స్ఫూర్తిని ఆవిష్కరణలను మరియు వ్యాపార అవకాశాలను ప్రోత్సహించడం, యువ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు మరియు వివిధ రంగాల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యం. డిసెంబర్ 25 నుంచి 27 వరకు బెంగళూరులో జరిగే ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు, యువత, పెట్టుబడిదారులు ,వివిధ రంగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

# కొల్లిపరలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్




**కొల్లిపర (గుంటూరు జిల్లా), సెప్టెంబర్ 17 : (మనం న్యూస్ ప్రతినిధి )**కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసినమెగా వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ప్రారంభించారు. ఏర్పాట్లను పరిశీలించారు.వైద్య పరికరాలు, మందుల అందుబాటును అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరంలో అన్ని రకాల స్పెషాలిటీ డాక్టర్స్ హాజరయ్యారు.ఉచిత రక్త పరీక్షలు, బిపి, మధుమేహం పరీక్షలతో పాటు ఇతర పరీక్షలను అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. క్రిటికల్ కేర్, సమీకృత ప్రయోగ శాలలు సైతం ఏర్పాటు చేసి అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెస్తుందని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెగా వైద్య శిబిరంలో మంచి వైద్య సేవలు అందించడమే కాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు మెగా వైద్య శిబిరం ఏర్పాట్లను వివరించారు.ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పోసా చౌడేశ్వరరావు, ఎన్.టి.ఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయ అధికారి విజయ ప్రకాశ్, వైద్యులు,తదితరులు పాల్గొన్నారు.

# వినూత్న హెచ్ ఆర్ విధానాలతో అత్యుత్తమ సంస్థగా ఎల్ జి ఈ ఇండియాకు గుర్తింపు





**సీహెచ్ఓ కు మోస్ట్ ఇంపాక్ట్ఫుల్ హెచ్ ఆర్ లీడర్ అవార్డు ప్రదానం**

విజయవాడ, సెప్టెంబర్ 17,(మనం న్యూస్): బెంగళూరులో జరిగిన 25వ ఆసియా పసిఫిక్ హెచ్ఆర్ఎం కాంగ్రెస్ అవార్డ్స్ 2026లో ఎల్ జి ఎలక్ట్రానిక్స్ ఇండియా రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకుంది. ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంస్థను తీర్చిదిద్దడంలో కంపెనీ చూపుతున్న నిబద్ధతకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయి. నాయకత్వ అభివృద్ధి, సంస్థాగత సామర్థ్యాల పెంపు, కార్యాలయ సంస్కృతి, ఉద్యోగుల అనుభవం మరియు ప్రతిభా వికాసం వంటి విభాగాల్లో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గాను ఎల్ జి ఎలక్ట్రానిక్స్ ఇండియాను వినూత్న హెచ్ ఆర్ విధానాలతో అత్యుత్తమ సంస్థ జాబితాలో గుర్తింపు పొందింది. ఇదే సందర్భంగా ఎల్ ఏ ఎలక్ట్రానిక్స్ ఇండియా, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ (సీ హెచ్ ఓ ) జ్యా నామ్ కిమ్ కి హెచ్ ఆర్ రంగంలో మార్పులను ముందుకు నడిపించడం, వ్యాపార వృద్ధికి ప్రజలను వ్యూహాత్మకంగా కీలక శక్తిగా నిలబెట్టడంలో చూపిన నాయకత్వానికి మోస్ట్ ఇంపాక్ట్ఫుల్ హెచ్ ఆర్ లీడర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ గుర్తింపు ఎల్ జి ఎలక్ట్రానిక్స్ ఇండియా లోని ప్రతి ఒక్క సభ్యునికి చెందుతుంది. మా హెచ్ ఆర్ విధానాలు ఎల్లప్పుడూ వ్యాపార రూపాంతర కార్యక్రమాలతో సన్నిహితంగా అనుసంధానమై ఉన్నాయి. మా వృద్ధి ప్రయాణంలో తదుపరి దశలోకి అడుగుపెడుతున్న ఈ సమయంలో, మా ఉద్యోగులు మరియు సంస్థ కలిసి అభివృద్ధి చెందేందుకు అవసరమైన నాయకత్వం, సామర్థ్యాలు, సంస్థాగత సంస్కృతి, నిర్మాణాన్ని అభివృద్ధి చేయడం మా బాధ్యత, అని ఎల్ జి ఎలక్ట్రానిక్స్ ఇండియా, సిహెచ్ఓ జ్యా నామ్ కిమ్ తెలిపారు. ఈ కార్యక్రమాలు సంస్థ యొక్క మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ఇండియా, మరియు మేక్ ఇండియా గ్లోబల్ అనే వ్యూహాత్మక దృష్టికోణానికి అనుగుణంగా ఉన్నాయి. స్థిరమైన వృద్ధికి, అలాగే భారత ప్రపంచ స్థాయి తయారీ, ఆవిష్కరణలు మరియు ఎగుమతుల కేంద్రంగా ఎదగడానికి అవసరమైన మానవ వనరులు, సంస్థాగత సామర్థ్యాలకు కంపెనీ ప్రాధాన్యత ఇస్తోంది. తాజా అవార్డులు హెచ్ ఆర్ రంగంలో ఎల్ జి ఎలక్ట్రానిక్స్ ఇండియా కొనసాగిస్తున్న అత్యుత్తమ ప్రస్థానానికి మరింత బలాన్ని చేకూర్చాయి. కంపెనీ వరుసగా రెండు సంవత్సరాలు (2024 మరియు 2025) లో గ్రేట్ ప్లేస్ టు వర్క్ఁ ధృవీకరణను పొందింది. అలాగే వరల్ హెచ్ఆర్డీ కాంగ్రెస్ నుంచి నేషనల్ బెస్ట్ ఎంప్లాయర్ బ్రాండ్ అవార్డు 2026ను కూడా అందుకుంది. అదనంగా, ఎల్ జి ఎలక్ట్రానిక్స్ ఇండియా, సిహెచ్ఓ, జ్యా నామ్ కిమ్ కి అధిక పనితీరు కనబరిచే, ఉద్యోగులే కేంద్రంగా ఉన్న సంస్థను నిర్మించడంలో ఆయన అందించిన కృషికి గుర్తింపుగా అత్యుత్తమ హెచ్ఆర్ ఐకానిక్ లీడర్ అవార్డును కూడా ప్రదానం చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో ఎల్ జి ఎలక్ట్రానిక్స్ ఇండియా, ఉద్యోగుల అభ్యాసం మరియు సామర్థ్యాభివృద్ధిపై నిరంతరంగా పెట్టుబడులు పెడుతున్నందుకు మోస్ట్ ఇన్నోవేటివ్ ఎల్ డి ప్రోగ్రామ్ అవార్డు 2026తో పాటు, హెచ్ఆర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ( హెచ్ఆర్ఏఐ ) నుంచి హెచ్ ఆర్ డిస్టింక్షన్ డైమండ్ గుర్తింపును కూడా అందుకుంది. ఈ అన్ని గుర్తింపులు కలిపి, సమ్మిళిత, చురుకైన మరియు అధిక పనితీరు కనబరిచే పని వాతావరణాన్ని నిర్మించాలన్న ( ఎల్ జి ) ఎలక్ట్రానిక్స్ ఇండియా నిరంతర ప్రయాణాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక్కడ ప్రతిభ, నాయకత్వం మరియు సంస్థాగత సామర్థ్యం - ఆవిష్కరణకు, అలాగే దీర్ఘకాలిక వ్యాపార వృద్ధికి పునాదిగా కొనసాగుతున్నాయి.

# హనుమాన్ జంక్షన్‌లో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



**శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు**

హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 17(మనం న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం హనుమాన్ జంక్షన్ లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దెందులూరు నియోజకవర్గం ఎం ఎల్ ఏ చింతమనేని ప్రభాకర్, గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఆయన నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా భారతీయ జనతా పార్టీ నాయకులు తోట మురళీధర్ ఏలూరు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సిహెచ్ విక్రమ్ కిషోర్ బాపులపాడు బిజెపి అధ్యక్షుడు పీవీ మాణిక్యాలరావు, జింకా నలగామరాజు, బి జె పి రమేష్,పెద్దిరెడ్డి సుబ్బారావు జనసేన నాయకులు అభయ ఆంజనేయస్వామి దేవాలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు మట్టా శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరావు దెందులూరు ఏఎంసి చైర్మన్ గారపాటి రామసీత ,తెలుగుదేశం నాయకులు వడ్డీ వాసవి, మాజీ జెడ్ పి టి సి సభ్యులు వేగిరెడ్డిపాపారావు, ఏపూరు తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ చింతా జగ్గారావు ,జనసేన నాయకులు గరికపాటి నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువమోర్చా,మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గణేష్ మండపం వద్ద సామినేని ఉదయభాను ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట సెప్టెంబర్ 17 మనం న్యూస్: జగ్గయ్యపేట పట్టణం, లయన్స్ క్లబ్ రోడ్డు నందు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు , కౌన్సిలర్ కొలగాని రాము , న్యాయవాది సామినేని రాము తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యం



కొల్లిపర (గుంటూరు జిల్లా), సెప్టెంబర్ 17 : (మనం న్యూస్ ప్రతినిధి )దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. కొల్లిపరలో గురువారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా యంత్రాంగం సంకల్పించిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయుటకు, వాటి పట్ల అవగాహన కల్పించుటకు ఇది ఒక మంచి వేదిక అన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వం వెళ్ళి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించుటకు అవకాశం కలుగుతుందన్నారు. నియోజక వర్గం స్థాయిలోనే నెలకు నాలుగు సార్లు అధికారులు సందర్శించడం వలన ప్రజలు స్థానికంగానే అర్జీల పరిష్కారం వివరాలు సైతం తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు. ప్రజల అర్జీలకు వారి సమక్షంలోనే నాణ్యమైన పరిష్కారం కూడా లభిస్తుందన్నారు. ఇప్పటికే ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించడమే కాకుండా సంబంధిత శాఖల అధికారులు నేరుగా అర్జీదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయాలను జిల్లా కలెక్టర్ సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.రమణి,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, ఆర్.టి.ఓ కె శ్రీహరి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె పార్థసారథి,జిల్లా వ్యవసాయ అధికారిఎం. పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్సి.హెచ్.రమేష్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.సత్యనారాయణ ,తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ,జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్,తెనాలి నియోజకవర్గ,మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూలపాడులో ఆశీర్వాద్ కా దియా

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 17, మనం న్యూస్: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత సెక్రటరీ, ఇబ్రహీంపట్నం మండలం క్లస్టర్ ఇంచార్జ్ గరికపాటి శివ ఆధ్వర్యంలో మూలపాడు గ్రామంలో ఆశీర్వాద్ కా దియా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గరికపాటి శివ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో మూలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ కి జన్మదినోత్సవ శుభాకాంక్షలు మరియు మద్దతును తెలియజేయడం జరిగిందని తెలిపారు.





# పారిశ్రామికవేత్తల సంక్షేమం, వ్యాపారాల విస్తరణే లక్ష్యం

**పారిశ్రామిక, వ్యాపార రంగ అభివృద్ధికి ప్రత్యేక వేదికగా ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్**

**180 మంది పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికుల నుంచి సమస్యలు, దరఖాస్తుల స్వీకరణ**

**ఉదయం నుంచి సాయంత్రం వరకు సమస్యలను ఓపికగా విన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**మచిలీపట్నం, సెప్టెంబరు 17(మనం న్యూస్):** పారిశ్రామికవేత్తల సంక్షేమం, వ్యాపారాల విస్తరణే లక్ష్యంగా నిర్వహించిన ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్ ద్వారా జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపన, వ్యాపారాల విస్తరణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు మరింత ఊతం లభిస్తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలో పారిశ్రామిక, వ్యాపార రంగాల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించడంతో పాటు, పరిశ్రమలు, వ్యాపారాల స్థాపన, విస్తరణలో ఎదురవుతున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్లో నిర్వహించిన ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్కు విశేష స్పందన లభించింది జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ప్రత్యేక చొరవతో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి 180 మందికి పైగా పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరై తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 180 దరఖాస్తులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఒక వర్క్షాప్ అనంతరం ప్రజలతో సుమారు మూడున్నర గంటల పాటు జరిగిన చర్చలో పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు తమ సమస్యలను వివరించిన నేపథ్యంలో, వారికి ప్రత్యేక వేదిక కల్పించాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. హడావుడికి తావులేకుండా నాణ్యమైన చర్చ, వాస్తవిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందించామని, మాట్లాడటం కంటే సమస్యలను వినడానికే ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. ఈ సమావేశం కోసం తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని రోజంతా దీనికే కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, సంబంధిత శాఖలు, బ్యాంకర్ల సమన్వయంతో సాధ్యమైన పరిష్కారాలను చూపించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం పరిధిలో సాధ్యమైన సహాయాన్ని అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సిబిల్ స్కోర్ వంటి అంశాల కారణంగా బ్యాంకు రుణాల మంజూరులో పరిమితులు ఉంటాయని, అలాగే వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కొన్ని వివాదాల్లో జిల్లా యంత్రాంగం జోక్యానికి పరిమితులు ఉంటాయని వివరించారు. అయితే విద్యుత్, మౌలిక వసతులు, అనుమతులు, రుణ దరఖాస్తు విధానం, ప్రభుత్వ పథకాలపై అవగాహన వంటి అంశాల్లో సంబంధిత శాఖలను అనుసంధానం చేసి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. వ్యాపారం లేదా పరిశ్రమ ప్రారంభించాలనే ఆలోచన ఉన్నప్పటికీ రుణం కోసం ఎక్కడ దరఖాస్తు చేయాలి, ఏ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు, బ్యాంకును ఎలా సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన లేని ఔత్సాహికులకు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, బ్యాంకుల రీజినల్ మేనేజర్లు తదితర అధికారులతో అనుసంధానం కల్పించి మార్గదర్శకత్వం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశానికి హాజరైన వారు తొలుత పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో తమ పేర్లు నమోదు చేసుకోగా, అనంతరం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, బ్యాంకర్లు, మత్స్య, ఉద్యాన, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారుల సమక్షంలో ఒక్కొక్కరితో ముఖాముఖిగా మాట్లాడారు. ఉదయం ప్రారంభమైన ఈ సమావేశం సాయంత్రం వరకు కొనసాగింది. సమావేశంలో వచ్చిన దరఖాస్తుల్లో ఫైనాన్స్కు సంబంధించి 54, భూమి/ఏపీఐఐసీకి 35, పీఎంఈజీపీకి 25, మార్కెటింగ్కు 22 దరఖాస్తులు వచ్చాయి. ఇతర సమస్యలకు సంబంధించి 18, శిక్షణ/నైపుణ్యాభివృద్ధికి 9, పీఎంఎఫ్ఎంఈకి 4, అనుమతులు/పర్మిషన్లకు 3, ప్రోత్సాహకాలకు 3, కాలుష్యం/పర్యావరణానికి 2, నీటి సరఫరాకు 2, ఫైనాన్స్/పీఎంఈజీపీకి 1, విద్యుత్కు 1, రోడ్లకు 1 చొప్పున దరఖాస్తులు నమోదయ్యాయి. ఫైనాన్స్కు సంబంధించిన దరఖాస్తులు అధికంగా రావడంతో అర్హులైన పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలపై పూర్తి అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రాయితీలతో కూడిన రుణ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి ముద్ర, పీఎంఈజీపీ, ఉన్నతి, లక్పత్ దీదీ, పీఎంఎఫ్ఎంఈ తదితర పథకాల ద్వారా ప్రయోజనం కల్పించడంతో పాటు బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. భూ కేటాయింపులు, అనుమతులు, విద్యుత్, నీటి సరఫరా, రహదారులు, పారిశ్రామికవాడల్లో మౌలిక వసతులు, మార్కెటింగ్ తదితర అంశాలపై



వచ్చిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్ని సమస్యలను సమావేశంలోనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించగా, మిగిలిన వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కే బాబ్జి, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు జే జ్యోతి, అయ్యా నాగరాజా, ఎల్డిఎం సి రవీంద్రారెడ్డి, ఆర్ సెటి డైరెక్టర్ స్వర్ణ శ్రీ, తపాల శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎస్బిఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎల్ వివి నాగేశ్వరరావు, ఖాదీ బోర్డు ఏడి శ్రావణ్ కుమార్, మెప్మా ఏవో డివి జగదీష్ తదితర అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



## కొండ ప్రాంతాల ప్రజల సంక్షేమానికి

# కొండంత భరోసా!

**పునరావాసం, భద్రత, జీవన ప్రమాణాలు, గృహ వసతులపై ప్రత్యేక దృష్టి**

**సవాళ్లను అధగమించి సుస్థిర సమాజ నిర్మాణం వైపు ముందడుగు**

**మేధోమథనానికి వేదికగా ఎస్పీఏలో ప్రత్యేక సమావేశం**

**(విజయవాడ,మనం బ్యూరో):** విజయవాడ లోని కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల క్షేమం, సంక్షేమం, జీవన ప్రమాణాల మెరుగుదల, పునరావాసం, పట్టణ గృహ వసతులపై సమగ్ర కార్యాచరణతో ముందడుగు వేయాలని ప్రముఖులు పిలుపునిచ్చారు. ప్రజలకు సురక్షితమైన, సుస్థిరమైన నివాస వసతి కల్పించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. గురువారం నగరంలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్పీఏ) సమావేశ మందిరంలో ఎస్పీఏతో పాటు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్సీఐ-హైదరాబాద్), జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి చొరవతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఏఎస్సీఐ డైరెక్టర్ జనరల్ డా. నిమ్మగడ్డ రమేష్ కుమార్, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, చెన్నై స్మార్ట్ సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజు, ఎస్పీఏ డైరెక్టర్ డా. రమేష్ సిరికొండ తదితరులు హాజరైన ఈ సమావేశంలో తొలుత ధ్యానచంద్ర హెచ్ఎం నగరంలోని ఇంద్రకీలాద్రి హిల్, విన్సీపేట హిల్, గుణదల హిల్, గాంధీ హిల్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు, కల్పిస్తున్న సౌకర్యాలు, వర్షాలు, వరదల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇటీవల కాలంలో చోటుచేసుకున్న ప్రమాదాలు తదితరాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 192 మైక్రో పాకెట్ల పరిధిలో దాదాపు రెండు లక్షల జనాభాకు కల్పిస్తున్న తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ప్రాథమిక మౌలిక వసతుల కల్పనతో పాటు జీవన ప్రమాణాల మెరుగుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. చినుకుపడితే చాలు కొండప్రాంతాల్లోని 48 సున్నిత ప్రాంతాల్లో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న భయాందోళన పరిస్థితులకు చెక్ పెట్టేందుకు ఓ గొప్ప ముందడుగు పడాల్సిన ఆవశ్యకతను సమావేశంలో ప్రముఖులు ఉద్ఘాటించారు. సవాళ్లను ఎదుర్కొంటూ నగరాన్ని ఆదర్శ నగరంగా నిలబెట్టేందుకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. ఏదైనా రాత్రికి రాత్రే సాధ్యపడదు.. ప్రజల భద్రత, సంక్షేమం, జీవన ప్రమాణాలకు సంబంధించిన కీలక అంశాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళిక, అన్ని శాఖల సమన్వయం, దశలవారీ కార్యాచరణ అవసరమని.. ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ముందుకు సాగుతామని, తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే స్థిరమైన పరిష్కారం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందుకు ఆధునిక సాంకేతికత, వనరుల సమర్థ వినియోగం, అర్బన్ హౌసింగ్ వినూత్న ప్రణాళికలు వంటివి దోహదం చేస్తాయన్నారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి మొదలయ్యే కార్యాచరణపైనా సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ సాఫ్టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.








# జిఎస్టీ,అదాయపు పన్ను సేవల పై అప్రమత్తంగా ఉండండి



▸ క్రమం తప్పకుండా పన్ను చెల్లించండి సలహాలు సూచనలు ఇచ్చేందుకు నిరంతరం అందుబాటులో ఉంటాము.

▸ ఎస్.వెంకటేశ్వరరావు, డి.బాస్కరరావు.భండారు వీరభద్రరావు.

**నందిగామ,సెప్టెంబర్,17,(మనం న్యూస్):** ప్రస్తుతం ఒక వైపు కంప్యూటర్ కాలం ఉరుకుల,పరుగుల జీవితం లో మనం చేసుకోవాల్సి ముఖ్యమైన పనులు సైతం పక్కన పెట్టేస్తాము వాటివల్ల అతి ప్రధానమైన జీఎస్టీ చెల్లింపులు,వ్యక్తిగత పన్నుల చెల్లిప్పులలో అలసత్వం మంచిది కాదని సలహాలు చూచనలు అందించేందుకు ముందుకు వచ్చారు నందిగామకు చెందిన ఎస్.వెంకటేశ్వరరావు, డి.బాస్కరరావు, భండారు వీరభద్రరావులు. ఈ సందర్భంగా రైతుపేటలోని సిఎం రోడ్డు లో గల సేవా కేంద్రంలో వీరు మాట్లాడుతూ ప్రజలకు అదాయపు పన్నుల చెల్లింపు,వ్యాపారానికి సంబంధించిన జీఎస్టీ చెల్లింపు పై అవగాహన కల్పించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు.సేవా ట్రస్టులు, వ్యాపారస్తులు, తప్పని సరిగా లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత అదాయపు పన్నుల గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. ప్రస్తుతం తమ వద్ద పాన్ కార్డుల పై అవగాహన,వ్యాపార ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయడం,జీఎస్టీ లైసెన్సులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎవిధంగా అనుమతులు పొందాలో ప్రజలకు, వ్యాపార వర్గాలకు, ప్రజలకు తెలియ జేస్తున్నామని తెలిపారు. సలహాలు, సూచనలకోసం అవసరమైతే తమ సేవకేంద్రాన్ని సంప్రదించవచ్చని అన్నారు. అదాయపు పన్ను,జీఎస్టీలకు సంబంధించిన ఎటువంటి లైసెన్సులకైనా తము ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని సేవా కేంద్ర ప్రతినిధి భండారు వీరభద్రరావు తెలిపారు. తమ ఫోన్ నెంబర్ కు కాల్ చేయవచ్చని అన్నారు..సెల్ నెంబర్ 9848440258.

# కెనడా వేదికపై జిల్లా కీర్తి చాటేందుకు సిద్ధం

▸ జిల్లా క్రీడాకారుని అంతర్జాతీయ లక్ష్యానికి పీ4 అండ

▸ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చొరవతో మార్గదర్శి ద్వారా ఆర్థిక సాయం



**విజయవాడ,సెప్టెంబర్, 17,(మనం న్యూస్):** కెనడాలో జరగనున్న కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్నకు ఎంపికైన జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన క్రీడాకారుడు సంకు కృపారావు అంతర్జాతీయ వేదికపై మరోసారి పతకం సాధించి ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అయితే అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను ఆశ్రయించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో కలెక్టర్ లక్ష్మీశ వెంటనే స్పందించారు. క్రీడాకారుని ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, అంతర్జాతీయ వేదికపై దేశం, రాష్ట్రం, జిల్లాకు పేరు తీసుకురావాలనే ఆయన సంకల్పానికి అండగా నిలవాలన్న ఉద్దేశంతో పీ4 ద్వారా సహకారం అందేలా చొరవచూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శిగా ముందుకు వచ్చిన సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను క్రీడాకారుడికి సహాయం అందించేలా అనుసంధానించారు. ఈ మేరకు సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సమకూర్చిన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ క్రీడాకారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కృపారావు కెనడాలో జరగనున్న కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకం సాధించాలనే ఆయన సంకల్పం సాకారం కావాలని, ఆయన విజయంతో ఎన్టీఆర్ జిల్లా పేరు అంతర్జాతీయ క్రీడా వేదికపై మార్మోగాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జీఎం కె.మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



# విశ్వబ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

▸ విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

▸ త్వరలో 'ఆదరణ-3' పునఃప్రారంభం – ఆధునిక పనిముట్ల పంపిణీ

▸ వృత్తిదారులకు 50 ఏళ్లకే పింఛను అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

▸ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతి






**విజయవాడ,సెప్టెంబర్, 17,(మనం ప్రతినిధి):** రాష్ట్రంలోని విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం, సమగ్ర ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతి తెలిపారు. స్థానిక తుమ్మల పల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రము లో గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేవశిల్పి విరాట్ విశ్వ కర్మ భగవాన్ రాష్ట్ర స్థాయి జయంతోత్సవము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతి హాజరై మాట్లాడుతూ.. . కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న విశ్వ బ్రాహ్మణులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం త్వరలోనే 'ఆదరణ-3' పథకాన్ని పునఃప్రారంభించి ఆధునిక పనిముట్లను అందించనుందన్నారు. సంప్రదాయ వృత్తిదారులకు ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావడం ద్వారా వారి వృత్తి సామర్థ్యం, ఆదాయ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ వృత్తిదారులకు 50 ఏళ్లకే పింఛను మంజూరు చేయాలన్న అంశాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడేలా చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తపరచారు. విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి శ్రీ నారా లోకేశ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్. సవిత లు సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. వారి సహకారంతో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా ఉన్న విశ్వ బ్రాహ్మణులు విడివిడిగా కాకుండా ఏకీకృతంగా సంఘటితమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజం ఏకతాటిపైకి వచ్చినప్పుడే తమ సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, తగిన గుర్తింపు మరియు చట్టసభల్లో ప్రాతినిధ్యం సాధించే అవకాశాలు మెరుగుపడతాయని ఆమె పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ పాలకమండలి డైరెక్టర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్పర్సన్ కమ్మరి పార్వతి తెలియజేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. విశ్వ సృష్టికి మూలకారకులు, సాంకేతికతకు మార్గదర్శకులు దేవశిల్పి విరాట్ విశ్వకర్మ భగవాన్ అని పేర్కొన్నారు. సృష్టి నిర్మాణంలోనూ, భారతీయ సంస్క ృతి-సంప్రదాయాలలోనూ విశ్వకర్మల పాత్ర అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. భారతదేశ మూల సంతతికి ఆదిపురుషులు విశ్వకర్మలే అని వాస్తు, శిల్పకళలకు శాస్త్రీయ దృక్పథాన్ని జోడించి నాగరికతకు ప్రాణం పోసిన ఘనత వీరిదన్నారు. శతాబ్దాల క్రితమే కాలజ్ఞానంలో ఆకాశంలో ఇనుప పక్షులు ఎగురుతాయని చెప్పిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గారి మాటలు నేటి విమానాలు, ఆధునిక డ్రోన్ టెక్నాలజీల రూపంలో నిజమయ్యాయన్నారు. గత 25 సంవత్సరాలుగా విజయవాడలో ప్రజాప్రతినిధిగా ఉన్న నాకు, విశ్వబ్రాహ్మణుల సేవలను నిరంతరం దగ్గరుండి చూసే భాగ్యం కలిగిందనారు. సంపాదించిన దాంట్లో పేదలకు సాయం చేస్తూ 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనతో సమాజ హితానికి కృషి చేసే నిస్వార్థ గుణం విశ్వబ్రాహ్మణుల సొంతం అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, పేదరిక నిర్మూలనకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎక్స్-అఫిషియో సెక్రటరీ టు గవర్నమెంట్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ.. విశ్వకర్మ వంశీయులైన స్వర్ణకారులు, వడ్రంగులు, కాంస్యకారులు, కమ్మరులు, శిల్పకారులు సంప్రదాయ వృత్తులతో సమాజ అభివృద్ధికి కీలకంగా నిలిచారని అన్నారు. ఆధునిక కాలంలో ఈ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్తో పాటు ప్రత్యేకంగా స్వర్ణకారుల అభివృద్ధి కార్పొరేషన్ను ఏర్పాటు చేసిందన్నారు.బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ. మల్లికార్జున మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని విశ్వబ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంప్రదాయ వృత్తులకు ఆధునిక సాంకేతికతను జోడించి ఆర్థికంగా ఎదగాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన చైర్మన్ పేరేపి ఈశ్వర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జెఎండి), ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ భీమశంకర్, బీసీ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ గౌరవ డైరెక్టర్లు, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ముందుగా దేవశిల్పి విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి ముందుగా అతిథులందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి



**విజయవాడ,సెప్టెంబర్, 17,(మనం న్యూస్):** సమస్త విశ్వానికి దివ్య వాస్తుశిల్పి శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగినక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్యం, సృజనాత్మకత, శ్రమ, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి విలువలు విశ్వకర్మ జయంతి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. సంప్రదాయ కళలు, కళాకారుల క్షేమం, సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని.. విశ్వకర్మ యోజన ద్వారా సాధికారిత క ల్పించే ంద ుక ు కృషిచేస్తున్నాయ న్నారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేతివృత్తుల కళాకారుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ ఎడుతుందని అన్నారు. ఆధునిక నైపుణ్యాల సముపార్జన ద్వారా చేతివృత్తులకు కొత్త వైభవం వస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు



**తాడేపల్లి,సెప్టెంబర్, 17,(మనం న్యూస్) :** సృష్టి నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర వెలకట్టలేనిదని, వారి కళానైపుణ్యాన్ని గుర్తించి సమాజంలో వారికి సముచిత గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక భరోసా కల్పించింది దివంగత నేత వైఎస్సార్, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని విశ్వబ్రాహ్మణ నేతలు కొనియాడారు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో వైయస్.జగన్ నేతృత్వంలో విశ్వకర్మ జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో పాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, వేలాది కోట్ల సంక్షేమ పథకాల ద్వారా విశ్వబ్రాహ్మణులకు లబ్ధి చేకూర్చిన విధానాన్ని విశ్వబ్రహ్మణ నేతలు గుర్తు చేశారు.

### కళాకారులను వ్యాపారపరం చేయకుండా ఆదుకోవాలి:మాజీ మంత్రి సాకే శైలజానాథ్

శ్రీ విరాట్ విశ్వకర్మ మహారాజు ఆశీస్సులు సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉండాలి. ప్రజలంతా క్షేమంగా వర్ధిల్లాలి. వృత్తి కళాకారులకు వైఎస్సార్సీపీ హయాంలోనే పెద్దపీట వేశారు. అనంతరం వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో వృత్తి కళాకారులు, శ్రామికులు సంతోషంగా జీవించేలా ఎన్నో విశేష కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తూ ప్రస్తుత ప్రభుత్వంలో కార్పొరేట్ శక్తులకే ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, సాంప్రదాయ వృత్తి కళాకారులను, నైపుణ్యం కలిగిన వ్యక్తులను పూర్తిగా విస్మరించి వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోంది. అత్యంత విశిష్టమైన కళా నైపుణ్యాన్ని వ్యాపారపరం కాకుండా పరిరక్షించాల్సిన అవసరం ఉంది. ఆ నైపుణ్యాలు మరింతగా రాణించేందుకు ప్రభుత్వాలు ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని తప్పనిసరిగా అందించాలి.

### ఎస్.ఎం. పవిత్ర, మాజీ చైర్మన్ – విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యానికి నిలువెత్తు నిదర్శనం జగనన్న పాలన: ఎస్.ఎం. పవిత్రవిశ్వకర్మ జయంతి అనేది కేవలం వేడుక మాత్రమే కాదు, మన మూలాలను, ఘనమైన చరిత్రను స్మరించుకుంటూ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకునే రోజు. విశ్వకర్మ భగవానుని నుంచి ఉద్భవించిన పంచ ఋషుల పరంపరతో కొనసాగుతున్న పంచవృత్తులు లేకపోతే ఇల్లు, నాగలి, ఆభరణాలు, రవాణా, దేవాలయాలు అన్నీ శూన్యం. సాధారణ వస్తువుకి సైతం దివ్యమైన అందం, నాణ్యత, విలువను తీసుకురావడం విశ్వబ్రాహ్మణులకే సాధ్యం. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ద్వారానే విశ్వబ్రాహ్మణ పేద కుటుంబాల పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లుగా స్థిరపడగలిగారు.

### ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు – వేల కోట్ల సంక్షేమం:

రాష్ట్ర విభజన అనంతరం విశ్వబ్రాహ్మణ సమాజం రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఎదురుచూస్తున్న సమయంలో, వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే 56 బీసీ కార్పొరేషన్లలో భాగంగా ప్రత్యేకంగా విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి గౌరవించారు. అలాగే వైయస్.జగన్ ప్రభుత్వ హయాంలో అందించిన రూ.2.57 లక్షల కోట్ల డీబీటీ సంక్షేమ పథకాల్లో దాదాపు రూ.140 కోట్లు విశ్వబ్రాహ్మణులకే నేరుగా అందాయి. ప్రస్తుతం అలాంటి పరిస్తితి లేదు. ఈ నేపథ్యంలో విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధనకు, భావితరాల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలబడాలి. రాబోయే రోజుల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి ని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరూ కంకణబద్ధులై పనిచేయాలి.

### జీవో నెం.24తో విశ్వకర్మ జయంతిని అధికారిక పండుగగా మార్చింది వైయస్ జగనే: ఎస్.డి. మురళీకృష

ణవైయస్సార్, వైయస్ జగన్మోహన్ రెడ్డి ల పాలనలోనే విశ్వబ్రాహ్మణుల ఆత్మగౌరవం, గుర్తింపు రెట్టింపయ్యాయి. మొట్టమొదటిసారిగా విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఆత్మగౌరవాన్ని పెంచింది దివంగత వైఎస్సార్ అయితే, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిలో స్థానం కల్పించింది వైయస్ జగన్ మాత్రమే. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎనిమిది మంది విశ్వబ్రాహ్మణులను డైరెక్టర్లుగా నియమించడంతో పాటు దేవాలయ పాలక మండళ్లు, స్థానిక సంస్థల్లో సముచిత గుర్తింపునిచ్చారని పేర్కొన్నారు.

### జీవో నెం. 24 ద్వారా రాష్ట్ర అధికారిక పండుగ:

2023లో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జీవో నెం. 24 జారీ చేయడం వల్లే నేడు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ, జిల్లా, మండల స్థాయిల్లో అధికారికంగా విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పుష్కరాల పేరిట విజయవాడలో కూల్చివేసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని వైయస్ జగన్ ప్రభుత్వం పునరుద్ధరించడమే కాకుండా, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలకు నెలకు రూ.10,000 ధూపదీప నైవేద్యం పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా భక్తుల సౌకర్యార్థం విజయవాడ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపించిన ఘనత కూడా జగనన్న ప్రభుత్వానికే దక్కుతుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థుల విజయానికి విశ్వబ్రాహ్మణులంతా అండగా నిలవాలి బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాలు సురక్షితంగా ఉంటాయి.

# ఉద్యోగుల మానసిక ఆరోగ్యానికి ప్రత్యేక కార్యక్రమం



- **ప్రతి గురువారం ఉచిత మానసిక ఆరోగ్య సెషన్స్**
- **జిల్లా కలెక్టర్ చొరవతో ఆకర్ష ఫౌండేషన్ భాగస్వామ్యంతో కార్యక్రమం**

**విజయవాడ, సెప్టెంబర్ 17,(మనం న్యూస్):** ఉద్యోగ విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ చొరవతో ప్రత్యేక మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం జిల్లా క్యాంపు కార్యాలయంలో ఉద్యోగుల కోసం ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు ఎదుర్కొనే పని ఒత్తిడిని గుర్తించడం, నియంత్రించడం, మానసిక సమస్యలను అధిగమించడం, పని-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత పాటించడం వంటి అంశాలపై నిపుణులు అవగాహన, కౌన్సెలింగ్ అందించారు. ఈ కార్యక్రమానికి 'ఆకర్ష ఫౌండేషన్' భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వెంకటశంకర్ రావు ఆధ్వర్యంలో సుమారు 150 మంది సైకాలజిస్టుల బృందం ఉచిత మానసిక ఆరోగ్య సేవలు, కౌన్సెలింగ్ అందిస్తోంది.ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికత, పని విధానాలకు అనుగుణంగా ఉద్యోగులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. మార్పుకు భయపడకుండా కొత్త విషయాలను నేర్చుకోవడం, కొత్త అవకాశాలను స్వీకరించడం, సానుకూల దృక్పథంతో బాధ్యతలను నిర్వహించడం అవసరమన్నారు. పరస్పర సహకారం, సమన్వయం, టీమ్ వర్క్తో కార్యాలయ పనితీరును మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ కౌన్సెలింగ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతి గురువారం ప్రత్యేక మానసిక ఆరోగ్య సెషన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తీవ్ర ఒత్తిడి లేదా మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు, బంధువులను కూడా ఈ సెషన్స్కు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వాన్స్డ్ కౌన్సెలింగ్, గైడెన్స్ నిపుణులు విడియాల చక్రవర్తి, సైకాలజిస్టులు డా.జి.శంకరరావు, డా.టీఎస్ రావు, శ్రీపతి జగదీశ్, సైకాలజిస్టు బి.నవితా శ్రీ, నోడల్ అధికారి జి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్య పరిరక్షణకు భరోసా



- **జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం.. 515 మందికి వైద్య పరీక్షలు**
- **ప్రజలకు ఉచిత ఓపీ, ఐపీ సేవలు అందిస్తున్నాం**
- **ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.జగదీష్**

**విజయవాడ, సెప్టెంబర్ 17, (మనం న్యూస్):** జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపటి ఆరోగ్యం కోసం ఆయుర్వేదం అనే నినాదంతో ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన, ఉచిత వైద్య సేవలను అందించనున్నట్లు విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం సత్యనారాయణపురం శ్రీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం వద్ద ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. శిబిరంలో మొత్తం 515 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా ఆయుర్వేద వైద్య సలహాలు అందించడం జరిగిందన్నారు. ప్రధానంగా కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు, పైల్స్, చర్మ వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు వంటి వివిధ రకాల అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. జగదీష్ మాట్లాడుతూ ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు, విజయవాడలోని డా.ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మరియు డా.నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న నిర్వహించనున్న 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా రేపటి ఆరోగ్యం కోసం ఆయుర్వేదం అనే నినాదంతో ప్రజలకు ఆయుర్వేద వైద్య విధానం, ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడ బందరు రోడ్డులో ఉన్న శ్రీ ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద వంద పడకల ఆసుపత్రిలో అన్ని రకాల రోగులకు నిష్ణాతులైన ఆయుర్వేద వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత ఓపీ, ఐపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ టి.బల్లయ్య మాట్లాడుతూ, వందేళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల మరియు ఆసుపత్రి ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఆయుర్వేద వైద్య విధానం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు, వ్యాధుల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆసుపత్రి సీనియర్ వైద్యులు డా.లక్ష్మీ శుభద్ర, డా.భాగ్యలక్ష్మి, డా.డి.పద్మజ, వైద్యులు డా.మురళీ బాబు, డా.శేషన్న, డా.ఎం.లత, డా.కమల కుమారి, పీజీ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు తదితరులు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు నేషనల్ మెడికల్ అసోసియేషన్ మరియు శ్రీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం కమిటీ నిర్వాహకులు సహకరించారు. వారి సహకారానికి ఆసుపత్రి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెంచడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం ప్రాధాన్యతను తెలియజేయడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

# ఎన్నికల కురుక్షేత్రంలో వైఎస్ఆర్ సీపీ విజయదుందుభి మోగిస్తుంది

- జగ్గయ్యపేట వైసిపి ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట: సెప్టెంబర్ 17 మనం న్యూస్:రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కురుక్షేత్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగిస్తుందని, ఎన్నికలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపు ఇచ్చారు. జగ్గయ్యపేట లో గురువారం సాయంత్రం జగ్గయ్యపేట మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నర్సింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు తన్నీరు నాగేశ్వరరావు దిశానిర్దేశం చేశారు. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్తను కలుపుకొని సమిష్టి కృషితో ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు.

### ఏకగ్రీవాలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తావులేదు

ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ..ఎక్కడా ఏకగ్రీవం అనే మాటే లేదు. ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థులు పోటీ చేయాలి. గ్రామంలోని ప్రతి వార్డు నుంచి సర్పంచ్ అభ్యర్థి వరకు, ఎంపీటీసీ నుంచి ఎంపీపీ వరకు, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు రాబోయే మున్సిపల్ ఎన్నికల వరకు ప్రతి ఎన్నికలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బరిలో ఉండాలి అని అన్నారు.అధికార పార్టీ ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజలు ధైర్యంగా ముందుకు రావాల్సిన ఎన్నికలే ఈ స్థానిక సంస్థల ఎన్నికలని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈ ఎన్నికల్లో బట్టబయలు అవుతుందని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్తను కలుపుకొని సమిష్టి కృషితో పోరాటం చేయాలి. ఈ ఎన్నికల కురుక్షేత్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగిస్తుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు అని తన్నీరు నాగేశ్వరరావు అన్నారు.

### సూపర్ సిక్స్ హామీలపై గ్రామాల్లో చర్చించాలి

రెండున్నర సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల అమలు విషయంలో ప్రభుత్వం విఫలమైందన్న విషయాన్ని ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ప్రతి గ్రామంలోని రచ్చబండ వద్ద ప్రజలతో సమావేశమై సూపర్ సిక్స్ హామీల అమలు పరిస్థితిపై చర్చించాలని, గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యతను ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో ఉన్న పరిస్థితులను ప్రజలకు స్పష్టంగా వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు.

### ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాటం చేయాలి

విద్యార్థులు, రైతులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందని తన్నీరు నాగేశ్వరరావు ఆరోపించారు. ప్రజా సమస్యలను గ్రామస్థాయిలో తెలుసుకుని వాటిపై పార్టీ తరపున నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, నాయకులు మరియు కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, నోటీసుల విచారణను అక్టోబర్ 5లోపు పూర్తి చేయాలి
- అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ

విజయవాడ: సెప్టెంబర్ 17, (మనం న్యూస్): భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల మేరకు రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ పురోగతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో నోటీసుల జారీ, నోటీసులపై విచారణ, ఓటరు కార్డుల ఫోటోలను అప్డేట్ చేయడం, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల విచారణ స్థితి, బూత్ లెవల్ అధికారులతో (బిఎల్ఓ) ఫోన్ కాల్స్ తదితర అంశాలపై పురోగతిని సమీక్షించారు. జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మొత్తం 1,94,681 మందికి నోటీసులు పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. వీరిలో ఇప్పటివరకు 1,87,335 మందికి విచారణ పూర్తి చేయగా, ఇంకా 7,346 మందికి విచారణ నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలోని 'ఇతరుల' కేటగిరీలో మొత్తం 13,95,044 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో తుది ఓటర్ల జాబితా కోసం 13,15,882 మందిని పార్క్ చేయడం జరిగిందని, ఇంకా 79,162 మంది పెండింగ్లో ఉన్నారని వివరించారు. పెండింగ్లో ఉన్న ప్రక్రియను కూడా నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఓటరు కార్డుల ఫోటోలను అప్డేట్ చేసే ప్రక్రియలో జిల్లాలో మొత్తం 6,51,452 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు బూత్ లెవల్ అధికారులు 5,13,116 మంది ఓటర్ల ఫోటోలను అప్డేట్ చేశారని చెప్పారు. ఆజౌల్లై అప్డేట్ చేసిన ఫోటోలలో 3,93,728 మందికి సంబంధించిన వివరాలను ఇఆర్ఓలు ఆమోదించడం జరిగిందని తెలిపారు. మిగిలిన ఫోటో అప్డేట్, ఆమోద ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై కూడా సమావేశంలో సమీక్ష జరిగింది. ప్రస్తుతం జిల్లాలో ఫారం-6 దరఖాస్తులు - 6,281, ఫారం-7 దరఖాస్తులు - 1,169, ఫారం-8 దరఖాస్తులు - 4,862 పెండింగ్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పెండింగ్లో ఉన్న ఈ దరఖాస్తులన్నింటిపై అక్టోబర్ 5వ తేదీలోపు విచారణ ప్రక్రియను పూర్తి చేసి, ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన దరఖాస్తులను తుది ఓటర్ల జాబితాలో ప్రచురించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫారం-6, ఫారం-8 దరఖాస్తులకు సంబంధించి అధిక సంఖ్యలో తిరస్కరణలు నమోదైన నియోజకవర్గాల వివరాలను కూడా సమావేశంలో సమీక్షించినట్లు కలెక్టర్ తెలిపారు. తిరస్కరణకు దారితీసిన కారణాలు, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ తదితర అంశాలను నిబంధనల మేరకు పరిశీలిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఓటర్లు తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారులతో నేరుగా మాట్లాడేందుకు అందుబాటులో ఉన్న 'ఆాజు ౘ ఇచుజూజూ రీజ్జీజి ఆజౌ'ై సేవకు సంబంధించి కూడా పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం 15 ఫిర్యాదులు 48 గంటల వ్యవధిలోపు పెండింగ్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పెండింగ్లో ఉన్న నోటీసుల విచారణ, దరఖాస్తుల పరిశీలన, ఫోటో అప్డేట్, బిఎల్ఓ-ఇఆర్ఓ స్థాయి ప్రక్రియలు తదితర అంశాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. అక్టోబర్ 5వ తేదీన విచారణ ప్రక్రియకు తుది గడువుగా పాటిస్తూ, నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.



# విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పొదుపు అలవాటును పెంపొందించాలి



- చిన్న మొత్తాల పొదుపుతో భవిష్యత్తులో ఆర్థిక భద్రత
- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

మచిలీపట్నం: సెప్టెంబరు 17,(మనం న్యూస్): విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పొదుపు అలవాటు, ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు.మచిలీపట్నం పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో చిలకలపూడిలోని పాండురంగ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ) ఖాతాల పాస్పుస్తక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు ఆర్డీ ఖాతాల పాస్పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న మొత్తంలో చేసే పొదుపు కూడా క్రమం తప్పకుండా కొనసాగిస్తే భవిష్యత్తులో పెద్ద మొత్తంగా మారుతుందని తెలిపారు. ఒక రూపాయి, రెండు రూపాయలు అని చిన్నచూపు చూడకుండా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇప్పటికే బ్యాంకు ఖాతాలు తెరవడం ఆర్థిక సమ్మిళితంలో భాగంగా అభినందనీయమని, అయితే ఖాతా తెరవడం మాత్రమే సరిపోదని, అందులో క్రమం తప్పకుండా పొదుపు చేయడం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు.చిన్న వయసులోనే పొదుపు, పెట్టుబడులపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకేసారి పెద్ద మొత్తాన్ని జమ చేయడం కంటే ప్రతిరోజూ లేదా క్రమం తప్పకుండా చిన్న మొత్తాలను పొదుపు చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. ఒక్క రూపాయి, రెండు రూపాయలు కలిసి పెద్ద మొత్తంగా మారినట్లే, ప్రతిరోజూ క్రమం తప్పకుండా చేసే చిన్న ప్రయత్నాలే భవిష్యత్ విజయానికి పునాది అని కలెక్టర్ తెలిపారు. పొదుపుతో పాటు సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజువారీ జీవితంలో వృథా చేసే ఐదు, పది నిమిషాలను సద్వినియోగం చేసుకున్నా వ్యక్తిత్వ వికాసంలో ఎంతో మార్పు వస్తుందని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుతూ క్రమశిక్షణ, సమయపాలన, పొదుపు వంటి మంచి అలవాట్లను చిన్ననాటి నుంచే అలవరుచుకోవాలని ఆకాంక్షించారు. తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాండురంగ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించగానే విద్యార్థులు, పాఠశాల సిబ్బంది నుంచి విశేష స్పందన లభించిందని, ఇప్పటివరకు 125 ఆర్డీ ఖాతాలు ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. విద్యార్థులు ఇప్పటి నుంచే పొదుపు అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో ఇతరులపై ఆధారపడకుండా ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగగలరని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి యువి సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంతో

# ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన

## ▸▸ తూర్పు నియోజకవర్గం

## శాసనసభ్యులు గద్దె రామ్మోహన్



**విజయవాడ,సెప్టెంబర్, 17,(మనం న్యూస్):** స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంతో ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం జెడి నగర్ రామాలయం వద్ద స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె. షమ్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరిలో కల్పించవచ్చని అన్నారు. స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన నగరాన్ని నిర్మించగలమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, వీధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయవాడను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మూమినేని ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇన్చార్జ్ రామారావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, నగరపాలక సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ సృజనాత్మకతకు ప్రతీక



**కొల్లిపర /గుంటూరు, సెప్టెంబర్ 17 : (మనం ప్రతినిధి):** దేవతల శిల్పి, దివ్య వాస్తుశిల్పి,నిర్మాణకర్తగా ప్రసిద్ధి చెందిన విశ్వకర్మ సృజనాత్మకతకు ప్రతీక అని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా గురువారం కొల్లిపరలో విశ్వకర్మ చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేవతలకు నగరాలు ,రాజభవనాలు, ఆయుధాలు, రథాలు,అనేక దివ్య నిర్మాణాలను రూపొందించిన మహాశిల్పిగా పురాణాలు ఆయనను వర్ణిస్తాయన్నారు. అద్భుతమైన వాస్తు, శిల్పకళ, యంత్ర నిర్మాణ జ్ఞానానికి ప్రతీకగా నిలిచారని అన్నారు.నిర్మాణ రంగంలో నైపుణ్యం, సృజనాత్మకత,శ్రమకు ప్రతీకగా నిలిచారని తెలిపారు. విశ్వకర్మను కేవలం భవనాల నిర్మాణకర్తగానే కాకుండా దివ్య ఆయుధాల తయారీదారుగా కూడా చెప్పుకోవడం జరుగుతుందని వివరించారు. వడ్రంగులు ,కమ్మరులు, స్వర్ణకారులు, శిల్పులు, యంత్ర నిపుణులు, ఇంజనీరింగ్ మరియు తయారీ రంగాలకు చెందిన అనేక వర్గాలు ఆయనను తమ ఆరాధ్య దైవంగా పూజించడం జరుగుతుందని అన్నారు. శ్రమకు గౌరవం,వృత్తి నైపుణ్యం, సృజనాత్మకత, సాంకేతిక అభివృద్ధి వంటి విలువలను గుర్తుచేసుకోవలసిన అవసరాన్ని తెలిపారు. 'సృజనాత్మకత, నైపుణ్యం, శ్రమ మరియు సాంకేతిక జ్ఞానం సమాజ అభివృద్ధికి పునాది' అనే ముఖ్యమైన సందేశాన్ని విశ్వకర్మ జీవిత చరిత్ర అందిస్తుందని అన్నారు. భారతీయ శిల్ప, నిర్మాణ, సాంకేతిక సంప్రదాయాలకు ప్రతీకగా కూడా విశ్వకర్మ జయంతిని గుర్తించడం జరుగుతుందని తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి,కార్యాలయ అధికారులు, సిబ్బంది విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్,గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు, పర్యాటక అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**విజయవాడ,సెప్టెంబర్,17 (మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ నందు విశ్వకర్మ జయంతి వేడుకలను వి యం సి సిబ్బంది తో అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు ఘనంగా నిర్వహించారు.ముందుగా విశ్వకర్మ గారి పటానికి పూలమాల అర్పించారు, ఈ సందర్భంగా అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు మాట్లాడుతూ విశ్వకర్మ బ్రహ్మ దేవుని కుమారునిగా పురాణాలు చెబుతున్నాయి. విశ్వకర్మ సకల కళలకు ఆదిదేవుడు, అధిపతని, దేవలోకాలను నిర్మించిన భవన శిల్పి, వాస్తు శిల్పి, స్థపతని (ఆర్కిటెక్చర్). దేవతలకు ఆకాశాన విహరించే పుష్పక విమానాలు, ఆయుధాలు, వివిధ రకాల సువర్ణాభరణాలు మరియు పనిముట్లను సృష్టించి ఇచ్చిన రూప శిల్పిని, విశ్వకర్మ భగవానుడు సమస్త హస్తకళలన్నింటికి ఆది దేవుడు మరియు విశ్వము ప్రధాన రూపశిల్పి అని, విశ్వకర్మ ప్రపంచానికి దైవ యాంత్రికుడు (ఇంజనీరు) అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన, అకౌంట్స్ ఎగ్జామినేర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, విఎంసి సూపరిండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వకర్మ జయంతి సందర్భంగా కలెక్టర్ పుష్పాంజలి



**మచిలీపట్నం, సెప్టెంబరు 17, (మనం న్యూస్):** విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి గురువారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో విశ్వకర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ శిల్పకళ, నిర్మాణ రంగం, సాంకేతిక నైపుణ్యాలతో సమాజ అభివృద్ధికి సేవలందిస్తున్న వృత్తి నిపుణులు, కార్మికులు, శిల్పులు, కళాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంప్రదాయంలో విశ్వకర్మను సృష్టికర్తగా, శిల్పకళకు ఆద్యుడిగా భావిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి రమేష్, కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# అన్న క్యాంటీన్లలో మెరుగైన సేవలు, పరిశుభ్రతే ప్రాధాన్యం కమిషనర్



**గుంటూరు నగరపాలక సంస్థ సెప్టెంబర్ :17 (మనం న్యూస్ ప్రతినిధి ):** గుంటూరు నగరం పరిధిలోని 7 అన్న క్యాంటీన్ల ద్వారా పేదలు, దినసరి కూలీలకు రూ.5కే నాణ్యమైన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే జిఎంసి కాల్ సెంటర్ 08632345103 కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,ప్రతి అన్న క్యాంటీన్ నిర్వహణను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిఎంసి నుండి 22 మంది క్షేత్ర స్థాయి, వారిని సమన్వయం చేయడానికి ఉపా సెల్ పిఓని ప్రత్యేక అధికారిగా నియమించామని తెలిపారు. అధికారులు ప్రతిరోజూ క్యాంటీన్లను నేరుగా సందర్శించి సరఫరా అవుతున్న ఆహార నాణ్యత, రుచి,ప్రాంగణ పరిశుభ్రత, సరఫరా సమయాలను నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు.ఆహార పంపిణీలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సిబ్బందికి తగిన సూచనలు అందిస్తూ,ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. క్యాంటీన్లలో పారిశుద్ధ్యం విషయంలో ఎటువంటి రాజీ పడేది లేదని,భోజనం చేసే ప్రాంతాలు,తాగునీటి స్థలాలు మరియు వంట పాత్రలు ఎప్పటికప్పుడు క్రిమిరహితంగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పారిశుధ్య సిబ్బంది నిరంతరం క్యాంటీన్ పరిసరాలను శుభ్రపరిచేలా ఆదేశాలు ఇచ్చామని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు నాణ్యమైన సురక్షిత తాగునీటిని అందుబాటులో ఉంచడం ద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని వివరించారు. అలాగే ఎండలు,అకాల వర్షాల వల్ల క్యాంటీన్లకు వచ్చే నిరుపేదలు భోజనం కోసం వేచి ఉండే సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రతి క్యాంటీన్ ఆవరణలో తగినంత నీడ లభించేలా షెడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.దీనివల్ల వృద్ధులు, మహిళలు మరియు కూలీలు ఇబ్బంది పడకుండా కూర్చుని ప్రశాంతంగా ఆహారాన్ని తీసుకోవడానికి వీలు కల్గుతుందన్నారు.ప్రతీ పేదవానికి తక్కువ ధరలోనే ఆకలి తీర్చడంతో పాటు వారికి పరిశుభ్రమైన,గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని,అందుకు తగిన విధంగా జిఎంసి నుండి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# జిఎంసి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను వేగవంతం చేయాలి

## ▸▸ కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు నగరపాలక సంస్థ సెప్టెంబర్ :17 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రాబోయే ఎన్నికల నిర్వహణను అత్యంత పటిష్టంగా,పారదర్శకంగా చేపట్టేందుకు అవసరమైన ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ స్థానిక ఏసి కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం, గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంభర్ లో ఎన్నికల నిర్వహణపై సంబంధిత విభాగాధిపతులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,ఎన్నికల ప్రక్రియకు ప్రాథమికమైన రిసెప్షన్ సెంటర్,బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్లు,మరియు ఓట్ల లెక్కింపు చేపట్టే కౌంటింగ్ సెంటర్లను తక్షణమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.ఇటీవల నగరంలో వార్డుల పెంపునకు సంబంధించిన తుది గెజిట్ విడుదలైన నేపథ్యంలో,పెరిగిన వార్డులు మరియు నూతన సరిహద్దులకు అనుగుణంగా ఎన్నికల ప్రణాళిక రూపుదిద్దాలన్నారు.ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉండేందుకు ప్రతీ అధికారి తప్పనిసరిగా 'రిటర్నింగ్ ఆఫీసర్ బుక్'ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి,నియమ నిబంధనలపై స్పష్టత ఉండాలని సూచించారు. నగరంలో పోలింగ్ కేంద్రాలను త్వరగా ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఈ నెల 22వ తేదీన నగరపాలక సంస్థ పరిధిలోని ఎలక్టోరల్ రోల్ (ఓటర్ల జాబితా) ప్రచురించాల్సి ఉన్నందున, అందుకు సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగాధికారులు ముందస్తు చర్యలను అత్యంత వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు.సమావేశంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్,డిప్యూటి కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు,సిహెచ్.శ్రీనివాస్,ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, సిటి ప్లానర్ డి.రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఏసిపీలు రెహ్మాన్,జకిరా, డిప్యూటీ తహశీల్దార్లు నాగమల్లేశ్వరరావు, కిరణ్మై తదితరులు పాల్గొన్నారు.

# బిఫోర్ మోదీ - ఆఫ్టర్ మోదీగా భారతదేశ రూపురేఖలు మారాయి

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు పశ్చిమ సెప్టెంబర్: 17( మనం న్యూస్ ప్రతినిధి):** మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, 'బిఫోర్ మోదీ - ఆఫ్టర్ మోదీ' అని చెప్పుకునేంతగా భారతదేశ రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ 18వ డివిజన్లోని భారత మాత విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు ఆధ్వర్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై, భారత మాత విగ్రహానికి నివాళులర్పించి మోదీ చిత్రపటానికి పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.ప్రధాని నరేంద్ర మోదీని కేవలం ఒక ప్రధానమంత్రిగా మాత్రమే కాకుండా భారతదేశానికి స్ఫూర్తినిచ్చే మహోన్నత వ్యక్తిగా గుర్తుంచుకోవాలని, అత్యంత సాధారణ కుటుంబం నుంచి దేశ అత్యున్నత పదవికి చేరుకోవడం వెనుక ఆయన కృషి, క్రమశిక్షణ,నిబద్ధత, అంకితభావం ఉన్నాయని పేర్కొన్నారు.ఎన్నో కష్టనష్టాలను అధిగమించి దేశ ప్రజల ఆశయాలను అర్థం చేసుకుంటూ ముందుకు సాగిన నాయకుడు నరేంద్ర మోదీ అని కొనియాడారు.భారతదేశ యువత ఆశయాలు,ప్రజల అవసరాలను గుర్తించి సంస్కరణల దిశగా దేశాన్ని నడిపించిన నాయకుడు మోదీయేనని పేర్కొన్నారు. సుపరిపాలనతో పాటు మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిచ్చే నాయకుడిగా ఆయన నిలిచారని తెలిపారు. ఒక మహిళా ప్రజాప్రతినిధిగా అలాంటి గొప్ప ప్రధానమంత్రి నాయకత్వంలో పనిచేయడం గర్వకారణమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.ప్రపంచ పటంలో భారతదేశాన్ని మరింత ప్రతిష్ఠాత్మక స్థానంలో నిలిపేందుకు మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని,భారత్ను ప్రపంచంలో అగ్రస్థానానికి తీసుకెళ్లే దిశగా ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో విమర్శలు, విభేదాలు సహజమే అయినప్పటికీ రాజకీయాలకు అతీతంగా వ్యక్తిత్వం, విలువలు,సూత్రాలతో ప్రజలకు ఆదర్శంగా నిలిచిన నాయకుడు నరేంద్ర మోదీ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన జీవితం,సిద్ధాంతాలు యువతకు స్ఫూర్తిదాయకమని,ప్రతి ఒక్కరూ వాటిని



ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ మరెన్నో పుట్టినరోజులు ఆయురారోగ్యాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావుతో పాటు బీజేపీ నాయకులు,కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలాగే మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 18వ డివిజన్లో నారదాసు మణి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు టీ స్టాళ్ల వద్ద ప్రజలకు ఉచితంగా టీ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఒకప్పుడు 'చాయ్ వాలా'గా జీవితాన్ని ప్రారంభించి దేశ ప్రధానమంత్రిగా ఎదిగిన మోదీ జీవితానికి స్ఫూర్తిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషమని పేర్కొంటూ, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

# ఓటరు జాబితా సవరణ నిర్దిష్ట సమయంలో పూర్తి కావాలి

**గుంటూరు, సెప్టెంబర్ 17 : (మనం న్యూస్ ప్రతినిధి)** ఓటరు జాబితా సవరణ నిర్దిష్ట సమయంలో పూర్తి కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ అన్నారు. జాబితా సవరణ తదితర అంశాలపై గురువారం జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఫారం 6, 7, 8 దరఖాస్తులు, ఫోటోల నాణ్యత,ఫోటోల అనుసంధానంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆగస్టు 30వ తేదీ వరకు అందిన దరఖాస్తులను



పక్కాగా విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి మాట్లాడుతూ జిల్లాలో ఎస్.ఐ.ఆర్ క్రింద చేపడుతున్న విచారణలు,ఫారం 6, 7, 8 పై చేపడుతున్న చర్యలు వివరించారు.

# గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నా



**గుంటూరు సెప్టెంబర్ 17 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామానికి చెందిన దళిత యువకుడు చీకటి గోపిని తాడికొండ సీఐ ఉమేష్, పోలీసులు చిత్రహింసలకు గురిచేసి చంపారని ఆరోపిస్తూ దళిత సంఘాలు, సిపిఐ, సిపిఎం ,కాంగ్రెస్ వైసీపీ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. గోపి మృతిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి జి వి రాజు,డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా కార్యదర్శి బెజవాడ యాకోబు, నాయకులు పుట్ట నాగేశ్వరావు, రేపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు పశ్చిమలో మహిళా గ్రీవెన్స్ డే నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు పశ్చిమ సెప్టెంబర్: 17 (మనం న్యూస్ ప్రతినిధి)** నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి మహిళా గ్రీవెన్స్ డే నిర్వహించి మహిళల నుంచి అర్జీలు స్వీకరించారు.మహిళలు వ్యక్తిగత,కుటుంబ,సంక్షేమ, ఉపాధి తదితర సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించిన గళ్ళా మాధవి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ.గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న మహిళా గ్రీవెన్స్ డే ద్వారా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా విని, సాధ్యమైనంత వేగంగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అనేక మంది మహిళలు తమ సమస్యలకు పరిష్కారం పొంది సంతృప్తితో వెళ్తుండటం ఆనందంగా ఉందన్నారు.మహిళల సాధికారత,సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ,మహిళలు ఈ గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని పిలుపునిచ్చారు.అనంతరం విశ్వకర్మ జయంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ చిత్రపటానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు వేసి భక్తి శ్రద్ధలతో స్మరించుకున్నారు. విశ్వకర్మ భగవానుడు శ్రమకు, నైపుణ్యానికి ప్రతీకగా నిలిచారని,సమాజ నిర్మాణంలో విశ్వకర్మ వర్గాల సేవలు విశేషమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ రావు, వేముల కొండా శ్రీనివాస్,కడియాల సుబ్బారావు,పదిరి ఈశ్వరాచారి,కలిచేటి హనుమంతరావు,చంద్రశేఖర్, ఉప్పుతల సాంబ మరియు పార్టీ నాయకులు,మహిళా కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గురువారం ఏటి అగ్రహారం, శాంతి నగర్, ఆదర్శ నగర్, రైల్ పేట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన నగర కమిషనర్

**గుంటూరు నగరపాలక సంస్థ సెప్టెంబర్ 17 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య వసతుల కల్పన మరియు రోడ్లు, డ్రైన్ల ఆక్రమణల తొలగింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం ఏటి అగ్రహారం, శాంతి నగర్,



ఆదర్శ నగర్, రైల్ పేట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, ప్రజారోగ్య,ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,డ్రైన్లలో ఉన్న పూడిక (సిల్ట్)ను ఎప్పటికప్పుడు తొలగించి, పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. రోజువారీ సిల్ట్ తొలగింపు పనులపై తనకు నివేదిక సమర్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరును క్రమం తప్పకుండా ఎఫ్ఆర్ఎస్ ద్వారానే నమోదు చేయాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రోడ్ల పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు (డిబ్రిస్)ను తక్షణమే తొలగించాలని, బహిరంగ ప్రదేశాలు లేదా రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు పారవేసే వ్యక్తులు,సంస్థలపై అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. నగరంలోని ఖాళీ స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే బాధ్యత శానిటరీ ఇన్స్పెక్టర్లదేనని, యజమానులకు నోటీసులు జారీ చేసి ప్లాట్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.దోమల వ్యాప్తిని అరికట్టడానికి ఫాగింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,ముఖ్యంగా శివారు ప్రాంతాలు,విలీన గ్రామాలు మరియు ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ జరిపించాలని ఆదేశించారు. డ్రైన్లను మూసివేస్తూ రోడ్లపైకి అక్రమంగా ర్యాంప్లు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని,వార్డుల వారీగా పరిశీలించి అలాంటి ర్యాంప్లను వెంటనే తొలగించాలని టిపిబిఓలను ఆదేశించారు.అలాగే రైలుపేట డ్రైన్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని,అక్కడ ప్రతిపాదించిన కల్వర్ట్ నిర్మాణాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. డ్రైన్లలో పూడికతీత లేదా నిర్మాణం పూర్తయిన వెంటనే రహదారులు నీట్గా ఉండేలా, మట్టి వ్యర్థాలు ఏవీ రోడ్డుపై ఉండకుండా శుభ్రం చేయాలని స్పష్టం చేశారు.నగరంలోని కాలువలు,డ్రైన్లపై ఎటువంటి ఆక్రమణలు ఉండకూడదని, ఆక్రమణలను తొలగించాలన్నారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఈఈ సుందర్రామిరెడ్డి,డిసిపి సూరజ్ కుమార్,ఈఈ విష్ణు వర్ధన్,డిఈఈలు రమేష్ బాబు ,చైతన్య,ఎస్ఎస్ సాంబయ్య,ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక,ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మహిళల చేత స్థాపించి.. మహిళల చేతనే నిమజ్జనం చేసిన వినాయకుడు

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు పశ్చిమ సెప్టెంబర్: 17 (మనం న్యూస్ ప్రతినిధి)** నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఈ ఏడాది ప్రత్యేకంగా మహిళల చేత వినాయకుడిని స్థాపించి, మహిళల చేతనే నిమజ్జనం చేసే విధంగా కార్యక్రమాన్ని రూపకల్పన చేశామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం ఘనంగా ప్రారంభించారు. నిమజ్జన వాహనానికి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం మహిళలు,పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వయంగా నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. శ్రీ వినాయక చవితి సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పూజలు ముగిసిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని కార్యాలయం నుంచి ప్రారంభించి బుడంపాడు కాలువ వరకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. సాధారణంగా వినాయక చవితి వేడుకలు యువతతో ముడిపడి ఉంటాయని, అయితే మహిళల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.వచ్చే ఏడాది మరింత మంది మహిళలతో రెట్టింపు ఉత్సాహంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. వినాయకుడు సిద్ధి,బుద్ధి ప్రదాత అని,ఆయన ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సద్బుద్ధితో, సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా ప్రతి శుభకార్యానికి ముందు ఆయనను పూజించడం భారతీయ సంప్రదాయమని పేర్కొన్నారు. చిన్నారులకు జ్ఞానాన్ని బోధించే దేవుడిగా, యువతకు భక్తి, ఉత్సాహాలకు ప్రతీకగా వినాయకుడు నిలిచారని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని జరుపుకునే పండుగ వినాయక చవితి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం నుంచి ఈ వేడుకలను ప్రారంభించడం ఆనందంగా ఉందని, కార్యక్రమానికి హాజరైన మహిళలు, పార్టీ నాయకులు,కార్యకర్తలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వినాయకుని నిమజ్జన ఊరేగింపు



గుంటూరు సెప్టెంబర్ :17 (మనం న్యూస్ ప్రతినిధి): గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీరభద్ర స్వామి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అదనపు ఎస్పీ (అడ్మిన్) రమణమూర్తి వినాయకుని నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు.పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు సందడిగా సాగింది.ఈ సందర్భంగా డప్పు కళాకారులు, తీన్మార్ కళాకారులు పాల్గొని తమ కళా ప్రదర్శనలతో సందడి చేశారు. భాజా భజంత్రీల నడుమ భక్తిశ్రద్ధలతో వినాయకుని ఊరేగింపు కొనసాగింది. అనంతరం సంఘం జాగర్లమూడి వద్ద వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేయనున్నారు.ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ బాబు,ఆర్ఐ శ్రీహరి రెడ్డి,ఆర్ఐ కృష్ణయ్య, ఆర్ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది,నాలుగో తరగతి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ అంతర్జాతీయ స్థాయి విద్యే వివిఐటియూ ముఖ్య ఉద్దేశం



గుంటూరు నంబూరు సెప్టెంబర్: 17 (మనం న్యూస్ ప్రతినిధి) అందరికీ అంతర్జాతీయ స్థాయి విద్య, రేపటి ప్రపంచానికి నైపుణ్యం గల యువతను అందించడమే వివిఐటి విశ్వవిద్యాలయం ముఖ్య ఉద్దేశమని యూనివర్సిటీ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. కళాశాలలో నిర్వహించిన 2026-27 విద్యాసంవత్సరపు మొదటి ఏడాది విద్యార్థుల తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈఏపిసెట్ నందు టాప్ ర్యాంకర్లుగా నిలిచి, విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ.అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించిన వెంటనే విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి మంచి స్పందన లభించిందని, మాపై వారికున్న నమ్మకం మా బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. విశ్వవిద్యాలయంలోని మౌలిక వసతులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవటం ద్వారా విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన పద్ధతులు అవలంబించేందుకు,వారిలోని విలువలను పెంపొందించేందుకు వివిఐటియూ దోహదపడుతుందని అన్నారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు మాట్లాడుతూ. విద్యార్థులు తమ లక్ష్య సాధన కొరకు కృషి చేయాలని తెలిపారు. విద్యతో పాటు అన్ని రంగాలలో ప్రావీణ్యం పొందేందుకు వివిఐటి ఒక చక్కటి అవకాశమని తెలిపారు.కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్ మామిళ్లపల్లి శ్రీకృష్ణ మాట్లాడుతూ...చదువుతో పాటు విద్యార్థుల నాయకత్వలక్షణం క్రిటికల్ థింకింగ్ పెంపొందించేందుకు వివిఐటి విశ్వవిద్యాలయం సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్, సిఎఫ్ఓఓ సూర్యదేవర బదరీప్రసాద్, రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు,డీన్ ఫ్రెష్మెన్ ఎమ్. వి.రఘురామ్,డీన్ ఏఎస్ బి సిహెచ్.ఉదయ్కుమార్,వివిధ విభాగాధిపతులు ,విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి




గుంటూరు సెప్టెంబర్ 17 (మనం ప్రతినిధి): అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తపేట మల్లయ్య లింగం భవన్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని గుంటూరు మెడికల్ కాలేజీ కి చెందిన బి.ఎస్.సి పారామెడికల్ మరియు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ విద్యార్థుల పరిష్కరించాలని పారామెడికల్ విద్యార్థులకు ఇంటెర్న్షిప్ సమయంలో స్టైఫండ్ 15,000 వేలు రూపాయలు ఇవ్వాలని అదేవిధంగా ప్రభుత్వాన్ని నిబంధనలు ప్రకారం 2021 బ్యాచ్ కోర్సు, ఇంటర్న్షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కూడ ఇప్పటివరకు కూడ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేపించుకుంటున్నారు.విద్యార్థుల వయస్సు,కెరీర్ అవకాశాలు,ఉన్నత చదువులు,ఉద్యోగ ప్రణాళికలు దెబ్బతింటున్నాయన్నారు. విద్యార్థులు రెగ్యులర్ కోర్సులో భాగంగా క్లినికల్ పోస్టింగ్స్ పూర్తి చేసేందుకు అదనపు కాలం పడుతోందని,ఇంటర్న్షిప్ పూర్తి చేసినప్పటికీ అడిషనల్ మాండేటరీ ఇంటర్న్షిప్ పేరుతోఎలాంటి స్టైఫండ్ ఇవ్వకుండా వారితో పనిచేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఎంబిబిఎస్, పీజీ విద్యార్థులతో సమానంగా ఎలాంటి సౌకర్యాలు అందడం లేదన్నారు.భోజనం చేసే సమయంలోనే లేక ల్యాబ్లో కెమికల్స్ వాసన వీరిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి అమర్ నాథ్,నగర నాయకులు సాయి గణేష్, మహేష్, వెంకట్ పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ.3 కోట్ల అభివృద్ధి పనులు

- పరిటాలవారిపాలెం, ఉప్పలపాడు, జరుగులవారిపాలెం, నాగభైరవునిపాలెంలో అభివృద్ధి కార్యక్రమాలు
- సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత: డా. పెమ్మసాని



గుంటూరు, సెప్టెంబర్ 17: (మనం న్యూస్ ప్రతినిధి) గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను కూడా సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పెదనందిపాడు మండలంలోని పరిటాలవారిపాలెం, ఉప్పలపాడు, జరుగులవారిపాలెం ,నాగభైరవునిపాలెం గ్రామాల్లో డా. పెమ్మసాని చంద్రశేఖర్ పర్యటించి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో గురువారం పాల్గొన్నారు. నాలుగు గ్రామాల్లో సుమారు రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.పరిటాలవారిపాలెం గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభించి, ప్రధాన డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఉప్పలపాడు గ్రామంలో ఆర్అండ్బీ రోడ్డును ప్రారంభించామని చెప్పారు. జరుగులవారిపాలెం గ్రామంలో గ్రామ చెరువు, సీసీ రోడ్ల పనులను ప్రారంభించామని, నాగభైరవునిపాలెంలో రోడ్లతో పాల్గొని నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించడంతో పాటు బహిరంగ సభలో పాల్గొన్నామని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, పంచాయతీ భవనాలు, చెరువుల అభివృద్ధి వంటి మౌలిక వసతుల పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లుగా ప్రతి రెండు మూడు వారాలకు ఒకసారి గ్రామాల్లో రూ.3 - 4 కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు.మూడు ప్రధాన గ్రామాల్లో ఒక్కో గ్రామానికి సుమారు రూ.50 లక్షల చొప్పున చెరువులను ఆధునీకరించి కమ్యూనిటీ ప్రదేశాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు.పిల్లలు, పెద్దలు అందరు వినియోగించుకునేలా ఈ ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.30 - 40 ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న గుంటూరు ఛానల్ భూసేకరణలో దాదాపు 90 శాతం పూర్తయిందని, పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో సుమారు రూ.100 కోట్లతో ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.గ్రామాల్లో ప్రజల నుంచి ప్రధానంగా అదనపు పెన్షన్లు, ఇళ్ల కోసం విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు.ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్కు తొలుత కేటాయించిన ఇళ్లకు అదనంగా మరో 2.25 లక్షల ఇళ్లు తీసుకురాగలిగామని, దీంతో రాష్ట్రానికి మొత్తం 3 లక్షల ఇళ్లు కేటాయించబడ్డాయని చెప్పారు.ప్రత్తిపాడు,గుంటూరు పార్లమెంట్ పరిధికి సాధ్యమైనంత ఎక్కువ ఇళ్లు తీసుకురావడానికి కృషి చేశామని తెలిపారు.స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రాబోయే 10 - 15 రోజుల్లో ఇళ్ల మంజూరు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థలం లేని అర్హులైన పేదలకు కూడా భూమిని సేకరించి ఇళ్ల స్థలాలు అందించాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన ఉందని, ఆ దిశగా కూడా త్వరలో చర్యలు ముందుకు సాగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.ప్రత్తిపాడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు గారికి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

## నైపుణ్యాభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు




- గుంటూరు జిల్లాలో 9,000 మంది యువతకు శిక్షణ, ఉపాధితో అనుసంధానం
- శిక్షణతో పాటు కెరీర్ అభివృద్ధిపై యువతకు అవగాహన కల్పించాలి
- డా. పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, సెప్టెంబర్ 17: (మనం న్యూస్ ప్రతినిధి) జిల్లాలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, మెరుగైన ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేసేందుకు అధికారులు,శిక్షణ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.గురువారం గుంటూరు కలెక్టరేట్లో శాసనసభ్యులు గళ్ళా మాధవి,బూర్ల రామాంజనేయులు,తెనాలి శ్రావణ్ కుమార్,జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతో కలిసి స్కిల్ డెవలప్మెంట్, ఎంప్లాయిమెంట్ జనరేషన్ అధికారులు, నైపుణ్య శిక్షణ నిర్వాహకులతో కేంద్ర మంత్రి సమీక్షను గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డ్డి-జికెవై) కింద గుంటూరు జిల్లాకు నిర్దేశించిన 9,000 మంది యువతను నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేసే లక్ష్యాన్ని సమర్థవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లోని అర్హత కలిగిన యువతకు ఈ కార్యక్రమం ద్వారా లభించే శిక్షణ,ఉద్యోగ అవకాశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.శిక్షణ అనంతరం అందుబాటులో ఉండే ఉద్యోగాలు, కెరీర్ అభివృద్ధి అవకాశాలు,భవిష్యత్లో నైపుణ్యాలు, ఆదాయం పెంచుకునే మార్గాలను అభ్యర్థులకు స్పష్టంగా వివరించాలని చెప్పారు. ప్రారంభ దశలో కొంత తక్కువ వేతనం ఉన్నప్పటికీ, సంబంధిత రంగంలో అనుభవం, నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా భవిష్యత్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు,అధిక వేతనాలు పొందే అవకాశం ఉంటుందని యువతకు వివరించాలని సూచించారు.పెద్ద సంఖ్యలో యువతకు శిక్షణ అందించేందుకు గత ఐదు నెలలుగా ప్రత్యేకంగా కసరత్తు చేశామని మంత్రి తెలిపారు. శిక్షణ సంస్థలతో చర్చించి, రానున్న సుమారు ఒకటిన్నర సంవత్సరానికి నిరంతరంగా శిక్షణ బ్యాచ్లు నిర్వహించేలా లక్ష్యాలను కేటాయించినట్లు చెప్పారు. గుంటూరు పార్లమెంట్తో పాటు పల్నాడు, బాపట్ల, ప్రకాశం తదితర సమీప ప్రాంతాల నిరుద్యోగ యువత కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్దేశించిన 9,000 లక్ష్యాన్ని మించి యువత ముందుకు వస్తే, అవసరాన్ని బట్టి అదనపు శిక్షణ, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యం మేరకు అక్టోబర్ మొదటి వారంలో మొదటి విడత శిక్షణ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మండల స్థాయిలో రిజిస్ట్రేషన్ క్యాంపులు నిర్వహించి అర్హులైన నిరుద్యోగ యువతను ఎంపిక చేస్తున్నట్లు వివరించారు.ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ,ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గుంటూరు పార్లమెంట్ పరిధిలో సుమారు 9,200 ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని, ఇందులో ప్రత్తిపాడు నియోజకవర్గానికి సుమారు 2,500 అవకాశాలు అందనున్నాయని తెలిపారు.ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, ప్రధానంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన 15 నుంచి 35 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ యువతకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కల్పించనున్నట్లు తెలిపారు. సుమారు 15 రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, పరిశ్రమల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగాలు,యువతలో ఉన్న నైపుణ్యాల మధ్య అంతరాన్ని తగ్గించడమే స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించి యువతను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ షేక్ ఖాజావలి,జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి అభినవ్,జిల్లా నైపుణ్య శాఖ అధికారి సంజీవరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విజయవాడలో అంగరంగ వైభవంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ప్రారంభం

- **ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సంపూర్ణ స్వచ్ఛత సాధ్యం**
- **స్వచ్ఛంద్ర కార్పొరేషన్ ఎండి బి. సునీల్ కుమార్ రెడ్డి**
- **స్వచ్ఛతా హి సేవా ప్రతి ఒక్కరి బాధ్యత**
- **కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ, సెప్టెంబర్,17,(మనం ప్రతినిధి):** విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో సేవతోనే స్వచ్ఛత సాధ్యం అనే సందేశంతో వివిధ స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించారు.సర్కిల్-1 పరిధిలోని భవానీపురం నేతాజీ స్కూల్ వద్ద విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ బి. సునీల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా బి. సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమమని తెలిపారు. ప్రతి వీధి, ప్రతి చెత్త సేకరణ కేంద్రం, ప్రతి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు



వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.వ్యర్థాల నిర్వహణ విషయంలో ప్రతి ఒక్కరిలో వ్యక్తిగత బాధ్యత, ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుద్ధ్య కార్మికులు మాత్రమే స్వచ్ఛత పనులు చేయాలనే భావనను విడనాడి, ప్రతి పౌరుడు తన పరిసరాల పరిశుభ్రతలో భాగస్వామి కావాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం పెరిగితే పారిశుద్ధ్య కార్మికులపై పని భారం తగ్గడంతో పాటు నగరం మరింత పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణలో విజయవాడ నగర పాలక సంస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని



ఆయన పేర్కొన్నారు. సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీలలో విజయవాడ కొనసాగుతుండటం, స్వచ్ఛ వాయు సర్వేక్షణలో రెండో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా ప్రతి ఒక్కరి



బాధ్యత అని అన్నారు. ప్రతి పౌరుడు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వామ్యమై పరిశుభ్రమైన నగర నిర్మాణం వైపు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించా లని సూచించారు. నదిలో మనం ఏది వేస్తామో అదే చివరకు మనకు తిరిగి వస్తుంది అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక నిమజ్జన ప్రాంతాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని కోరారు. కాలువలు, నదులు, ఇతర నీటి వనరుల్లో వ్యర్థాలు వేయడం వల్ల అవే తిరిగి




నగరంలో సమస్యలకు కారణమవుతాయని తెలిపారు. స్వచ్ఛతా హి సేవాలో భాగంగా విద్యార్థులకు నాలుగు రంగుల చెత్తబుట్టల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆకుపచ్చ, నీలం, ఎరుపు, నలుపు రంగుల బుట్టల్లో ఏయే రకాల వ్యర్థాలను వేయాలనే అంశాలను స్టాళ్ల ద్వారా వివరించారు. అలాగే వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.




పర్యావరణ పరిరక్షణలో భాగంగా మహిళలు, విద్యార్థులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించా లని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అనంతరం నాలుగు రంగుల చెత్తబుట్టల వినియోగం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.




# లీ ఫౌండేషన్ సహకారంతో ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

- **ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విజయ సునీత**
- **నియోజక వర్గ టిడిపి ఇంచార్జీ జి. ఎరిక్షన్ బాబు**

**మార్కాపురం.సెప్టెంబర్, 17,(మనం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆయన సేవా స్ఫూర్తితో లీ ఫౌండేషన్ సహకారంతో, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా దోర్నాల మండలం నల్లమల ప్రాంతంలోని కొర్రపోలు తండాలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఎం .విజయ సునీత ప్రారంభించారు. అనంతరం





శిబిరంలో ప్రజలకు అందుబాటులో ఉంచిన మందులను పరిశీలించి, వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, మందులు అందుబాటులోకి రావడంతో వారి ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా, వైద్యుల సూచనలు పాటించాలని కలెక్టర్ కోరారు. వైద్య శిబిరాల్లో అందిస్తున్న ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, మందుల పంపిణీ వంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని



సూచించారు. ఉచితంగా పంపిణీ చేస్తున్న మందులను వైద్యుల సూచనల మేరకే వినియోగించాలని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని విజయ సునీత అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అక్కడి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లీ ఫౌండేషన్ మరియు ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ ఛైర్మన్, బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి చేస్తున్న కృషిని జిల్లా కలెక్టర్ అభినందించారు. వై పాలెం నియోజక వర్గ టిడిపి ఇంచార్జీ జి.ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందించిన ఏలూరి లక్ష్మీదేవి





చారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించారు.ఎన్ డి ఎ కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని సమాజంలో ఎదగాలని ఆయన గిరిజనులకు సూచించారు. ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్, బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో తమ ట్రస్ట్ ద్వారా వైద్య సేవలను అందించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తమ ట్రస్ట్ చేస్తున్న కార్యక్రమాలకు స్ఫూర్తి ప్రధాని నరేంద్ర మోడీ అని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఏలూరి ట్రస్ట్ తెలుగు రాష్ట్రాల్లో చేసిన సేవల వలన వేలాది మంది ప్రజల ప్రాణాలను కాపాడాగాలిగా మన్న తృప్తి కలిగిందని అన్నారు. గత ఫిబ్రవరి నెలలో శివరాత్రి పర్వదినం సందర్భంగా దోర్నాల లో పెద్ద ఎత్తున మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎమ్ .శివరామిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనిషే, జిల్లా మలేరియా వైద్య అధికారి డాక్టర్ కె.రాహుల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ. కృష్ణారావు, జిల్లా ఇన్చార్జ్ ఎస్కే శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్ రెడ్డి, బాల కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

